



● చిలకలూరిపేట ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, తదితరులు

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో మంత్రి జనార్దన్‌రెడ్డి

కారంపూడి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి తెలిపారు. కారంపూడిలోని ఎస్సీ కాలనీలో రూ.15 లక్షలతో శుక్రవారం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఒప్పిచర్లలోని బీసీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ఒడియరాజుల కమ్యూనిటి హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలకుల అప్పులతో కుదేలైనా అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు ఆగకుండా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా అన్ని వర్గాలకు కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నామన్నారు. తొలుత మంత్రికి కారంపూడిలో టీడీపీ, జనసేన శ్రేణుల నుంచి ఘన స్వాగతం లభించింది. మూడు కి.మీ.ల మేర జరిగిన ర్యాలీలో బస్టాండ్ వద్ద గజమాలతో నేతలకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, నాయకులు పంగులూరి పుల్లయ్య, అంజయ్య, గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, గోళ్ల సురేష్ యాదవ్, కటికల బాలకృష్ణ, బొమ్మిన శేషగిరిరావు, రమావత్ సరస్వతి బాలునాయక్, పలిశెట్టి రాఘవనాయుడు, జనసేన నేతలు బూసా రామాంజినేయులు, కేసనపల్లి కృష్ణ, బీజేపీ నేతలు శెట్టి హనుమంతురావు పాల్గొన్నారు.

తల్లికేనా వందనం



అర్హత ఉన్న అదృష్టం లేదు

గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మా కుమారుడు గౌతమ్ మణికంఠ 2వ తరగతి చదువుతున్నాడు. 2022లో భార్య చనిపోయింది. అప్పటి నుంచి నా సంరక్షణలో కుమారుడు ఉన్నాడు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని జూన్‌లో అర్జీ పెట్టుకున్నాను. అయితే ఇంతవరకు ఎలాంటి స్పందన రాలేదు. ప్రభుత్వం ఈ పథకాన్ని తమ లాంటి వారికి కూడా అమలు చేయాలి.

\- పద్మారావు, పోతుమర్రు

కుటుంబంలో బడికి వెళ్లే పిల్లలు ఎందరు ఉన్నా.. అందరికీ తల్లికి వందనం ఇస్తామని సూపర్ సిక్స్‌లో కూటమి ప్రభుత్వం ప్రకటించింది. చెప్పి నట్లుగానే గత నెలలో తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం వర్తింప చేసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఐదుగురు పిల్లలు ఉన్న తల్లుల ఖాతాల్లో కూడా తల్లికి వందనం నగదు జమ చేశారు. చెప్పినట్లుగానే నగదు జమ అవడంతో ఆయా కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. అయితే వివిధ కారణాల వల్ల తల్లులు దూరమైన పిల్లలు ఈ అదృష్టానికి నోచుకోలేక పోయారు. తల్లి మృతి చెందిన పిల్లలు తండ్రులు, అమ్మమ్మ, నానమ్మల ఆశ్రయంలో ఉంటూ బడికి వెళ్తున్నా వారికి తల్లికి వందనం పథకం అమలు కాలేదు. ఈ పరిస్థితుల్లో తల్లి లేని పిల్లలకూ అంటే తండ్రులకూ ఈ పథకాన్ని వర్తింప చేయాలని పలువురు ఆయా సచివాలయాల్లో, తహసీల్దార్, కలెక్టర్ గ్రీవెన్స్‌ల్లో అర్జీలు అందజేస్తున్నారు.

- తల్లి మృతి చెందిన పిల్లలకు అందదా
- తండ్రులకూ వర్తింప చేయాలని గ్రీవెన్స్‌లో అర్జీలు

చిలకలూరిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగా కూటమి ప్రభుత్వం గత నెలలో తల్లికి వందనం పథకం అమలు చేసింది. కుటుంబంలో ఎంతమంది



విద్యార్థిని అనన్యతో తండ్రి రజనీకాంత్

పిల్లలు ఉన్నా వారందరికీ రూ.13 వేలు చొప్పున నగదు జమచేసింది. అయితే అన్ని అర్హతులు ఉన్నా కేవలం తల్లి మృతి చెందిన కారణంగా పలువురు పిల్లలకు ఈ పథకం అమలు కాలేదు. తల్లి దూరమైనా వారి సంతానం తండ్రి వద్ద ఆశ్రయం పొందుతుంటోంది. అయితే ఈ పథకానికి అర్హత తల్లి పేరుతో బ్యాంకు ఖాతా ఉండటంతో తండ్రి ఆశ్రయంలో ఉంటున్న పిల్లలకు నగదు జమ కాలేదు. తల్లి లేని విద్యార్థులకు తండ్రి బ్యాంకు ఖాతాల ద్వారా పథకాన్ని వర్తింపజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకారం సాయం అందించాల్సి ఉండగా ఆ విషయాన్ని ప్రభుత్వం మరిచింది. అనర్హుల జాబితాలో తమ పిల్లల పేర్లు చూసుకున్న వారు, నగదు జమ కాని తండ్రులు గ్రీవెన్స్ ద్వారా అర్జీలు దాఖలు చేశారు. అయితే రెండో విడత ఈ నెల 10న పలువురికి నగదు జమ చేశారు. ఇందులోనూ నగదు జమ కాకపోవడంతో తండ్రులు నిరాశకు గురయ్యారు. గ్రీవెన్స్‌ల్లో తాము ఇచ్చిన అర్జీలకు స్పందన లేకపోవడంపై (మిగతా 6వ పేజీలో)

బైపాస్.. జరిలం

- 167ఏ రహదారి భూసేకరణలో ప్రతిష్టంభన
- పరిహారంపై రైతులను ఒప్పించిన రెవెన్యూ అధికారులు
- లిఖిత పూర్వక హామీపై సానుకూలంగా స్పందించని హైవే అథారిటీ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లా ఓడరేవు - పల్నాడు జిల్లా పొందుగల 167ఏ జాతీయ రహదారి నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. రహదారి పనులు బాపట్ల జిల్లా పరిధిలో వేగవంతంగా జరుగుతుండగా పల్నాడు జిల్లాలో భూసేకరణ సమస్య కారణంగా పనులు నిలిచిపోయాయి. నరసరావుపేట బైపాస్ మినహా మిగతా ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్) ఆధ్వర్యంలో రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టగా ప్యాకేజి ఒకటిలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. అయితే నరసరావుపేట బైపాస్‌కు భూసేకరణ విషయంలో అధికార యంత్రాంగం, రైతుల మధ్య వివాదం కొనసాగుతోంది. బాధిత రైతులు, స్థల యజమానులు హైకోర్టును ఆశ్రయించడంతో ఐదేళ్లుగా భూసేకరణ నిలిచిపోయింది. అయితే ఇటీవల బైపాస్‌కి అవసరమైన 279.16 ఎకరాలకు సంబంధించి పరిహారంపై రెవెన్యూ అధికారులు సూచించిన పరిహారానికి రైతులు అంగీకరించారు. నరసరావుపేట పట్టణ పరిధిలో ఉన్న వ్యవసాయ భూమికి రిజిస్ట్రేషన్ విలువపై రెండు రెట్లు, జొన్నలగడ్డ, కేసానుపల్లి, రావిపాడు, గుంటగర్లపాడు గ్రామాల పరిధిలోని భూములకు రెండున్నర రెట్లు పరిహారం చెల్లిస్తామని రెవెన్యూ అధికారులు బాధిత రైతులను ఒప్పించారు. ఇళ్ల స్థలాలకు గజానికి రూ.19,000, రహదారికి లోపల ఉన్న ఇళ్ల స్థలాలకు రూ.16,000 చెల్లిస్తామని ఆ సమావేశంలో ఆర్డీవో తెలిపారు. ఈ మేరకు భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోయే వారి నుంచి సంబంధిత పత్రాలను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. అయితే హైవే అథారిటీ అధికారుల నుంచి సానుకూలత కానరావడం లేదు.

లిఖిత పూర్వక హామీపై రైతుల పట్టు

రెవెన్యూ శాఖ తెలియజేసిన ప్రకారం పరిహారం చెల్లిస్తే భూములు ఇస్తామని బాధిత రైతులు చెబుతున్నారు. పరిహారం ఎంత చెల్లిస్తారో లిఖిత పూర్వకంగా ఒప్పంద పత్రాలు రాసిస్తేనే తాము కోర్టులో పిటిషన్లను ఉపసంహరించు కుంటామంటున్నారు. అయితే పరిహారంపై లిఖిత పూర్వకంగా తాము హామీ ఇవ్వలేమని రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. హైవే అథారిటీ అధికారులకు సమాచారం ఇచ్చామంటున్నారు. ఈ నేపథ్యంలో కోర్టులో పిటిషన్లను ఉపసంహరించుకునేందుకు రైతులు అంగీకరించడం లేదు. రైతులు కోర్టులో వేసిన కేసును ఉపసంహరిస్తేనే భూసేకరణ ముందుకు సాగే పరిస్థితి నెలకొంది.

మెడికిల్ ప్రాక్టీషనర్లు

- ప్రాణాలపైకి తెస్తోన్న ఆర్ఎంపీల వైద్యం
- నిబంధనలకు విరుద్ధంగా అన్ని జబ్బులకు చికిత్సలు

జ్వరం అని వెళ్తే ఊపిరిపోయింది..

ఇటీవల తెనాలి ప్రాంతంలో చిరు వ్యాపారి అయిన ఓ మహిళ జ్వరం, ఒళ్లు నొప్పులు ఉన్నాయని స్థానిక ఆర్ఎంపీని ఆశ్రయించారు. రెండు ఇంజక్షన్లు చేయగా జ్వరం, నొప్పులు మాయమయ్యాయి. మరుసటి రోజు మళ్లీ జ్వరం వచ్చింది. తిరిగి ఆర్ఎంపీని సంప్రదించగా ఇంజక్షన్లు ఇచ్చారు. ఇలా నాలుగురోజులు చేశారు. రోగి మరింత నీరసించి పోగా బంధువులు ఆర్ఎంపీని నిలదీయడంతో పెద్దాసుపత్రికి వెళ్లమని సలహా ఇచ్చాడు. దీంతో జిల్లా ప్రభుత్వవైద్యశాలను సంప్రదించగా వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూ జ్వరంగా గుర్తించారు. అయి తే అప్పటికే ప్లేట్‌లెట్స్ 25 వేలకు పడిపోవడంతో గుంటూరుకు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.



వినుకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సిన రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్లు(ఆర్ఎంపీలు) ఎంబీబీఎస్, ఎంఎస్ వైద్యుల తరహాలో వైద్యం అందిస్తున్నారు. వైద్య సలహాలకే పరిమితం కావాల్సిన వారు ఒక్క శస్త్ర చికిత్సలు మినహా మిగిలిన అన్ని తరహా చికిత్సలు చేస్తున్నారు. ప్రైవేటు వైద్యశాలల్లో దోపిడీ తట్టుకోలేక, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యంపై అనుమానంతో పలువురు సామాన్యులు, మధ్య తరగతి వారు ఎక్కడి కక్కడ అందుబాటులో ఉన్న ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అవకాశంగా ఆర్ఎంపీలు రెచ్చిపోతున్నారు. మిడిమిడిజ్ఞానంతో అందిస్తున్న వైద్యం చివరకు రోగుల ప్రాణాలపైకి తెస్తోంది. జ్వరం అని వచ్చే రోగులకు సాధారణ వైద్యం అందిస్తూ పిండేసుకుంటున్నారు. చివరకు అది డెంగ్యూ, మలేరియా జ్వరాలను తేలేసరికి బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లా పరిధిలో మారుమూల గ్రామం నుంచి జిల్లా, మున్సిపల్ కేంద్రాల్లో పలువురు ఆర్ఎంపీలుగా అవతారం ఎత్తి ఏ రోగానికైనా చికిత్సలు అందిస్తున్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరగా చికిత్సల పేరుతో రకరకాల ఇంజక్షన్లు చేస్తూ, సెలైన్లు ఎక్కిస్తూ, స్టెరాయిడ్స్ వినియోగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎంతకీ రోగం తగ్గక పోవడంతో (మిగతా 6వ పేజీలో)



లక్ష గాజులతో వాసవీమాతకు పూజలు

దాచేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా దాచేపల్లిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. లక్ష గాజులతో అలంకరించి కుంకుమ పూజ చేశారు. దాచేపల్లి గ్రామ దేవత శ్రీవీర్ల అంకమ్మ తల్లి దేవాలయంలో మహిళలు అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులు అమ్మవారికి లలితా పారాయణం, కనకధార స్తోత్రం, ఖడ్గమాల పారాయణం చేశారు. అంకమ్మతల్లి దేవాలయంలో ఈ నెల మొత్తం చండీయాగం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.



వైసీపీ నిర్వాకంతో సింగపూర్‌తో దెబ్బతిన్న సంబంధాలు

ఆమడ దూరంలో.. ఆపదకు అడ్డుగోడ!



29 నుంచి దక్షిణాది రాష్ట్రాల.. నవోదయ విద్యార్థులకు యోగా పోటీలు

అన్యాక్రాంతమైన భూముల స్వాధీనం : జేసీ సూరజ్

పిడుగురాళ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ ఆక్రమణల లెక్క తేల్చడంపై దృష్టి సారించామని, అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుంటామని జేసీ సూరజ్ గనోరే ధనుంజయ్ తెలిపారు. రెవెన్యూ యంత్రాంగంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జేసీ సమీక్షించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రభుత్వ భూములు, పట్టా భూముల అన్యాక్రాంతంపై అందిన ఫిర్యాదుల ఆధారంగా విచారణ జరుపుతున్నామన్నారు. ప్రభుత్వ భూముల చిట్టా బయటకు తీస్తున్నామని, అవి ఎవరెవరి ఆధీనంలో ఉన్నాయో ఆరా తీయడంతో పాటు అవి వారి ఆధీనంలోకి ఎలా వెళ్లాయో, వారి వద్ద ఎటువంటి పత్రాలు ఉన్నాయో తెలుసుకుంటున్నా మన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములకు హక్కుపత్రాలు ఇచ్చిన



మాట్లాడుతున్న జేసీ సూరజ్ గనోరే ధనుంజయ్

అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే గురజాల నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల వివరాల లెక్క తీయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. పులిచింతల ప్రాజెక్టు ముంపు భూముల ఆక్రమణలపై ప్రశ్నించగా గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా వివరాలను తీస్తున్నామని, రికార్డులు తారుమారు చేసినట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఒక సర్వే నెంబర్‌లో పూర్తి విస్తీర్ణానికి మించి భూమిని రికార్డులో నమోదు చేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. గ్రామాల వారీగా భూమి మ్యుటేషన్, పట్టాదారు పాస్‌పుస్తకాల వివరాలు, ఆదాయ, కుల ధ్రువీకరణ దరఖాస్తుల వివరాలను తెలుసుకుని వాటిల్లో ఎన్ని పరిష్కరించారనే విషయంపై అధికారుల నుంచి జేసీ వివరణ తీసుకున్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మధుబాబు, సర్వేయర్ వెంకటేశ్వర్లు, డీటీ సుధాకరశర్మ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పత్తి సాగుకు బీమా చేసుకోవాలి

రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి సూచన

నరసరావుపేట రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పత్తి పంట సాగు చేసే రైతులందరూ తప్పనిసరిగా బీమా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జగ్గారావు తెలిపారు. పత్తి పంట బీమా నమోదుపై అవగాహన కల్పిస్తూ జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా నమోదు గడువును ఈ నెల 31 వరకు పొడిగించామన్నారు. పత్తి పంటను సాగు చేస్తున్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు అండగా బీమా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ హనుమంతరావు, ఏఐసీ పరిపాలన అధికారి ఎల్ భయ్యా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గ్రానైట్ లారీల డ్రైవర్లపై కేసులు

దాచేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ లారీలను పట్టుకోవడానికి వచ్చిన కమర్షియల్ ట్యాక్స్ అధికారులను అడ్డుకున్న లారీ డ్రైవర్లపై కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఈమని విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం దాచేపల్లి పోలీస్‌స్టేషన్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 18న రాష్ట్ర సరిహద్దు తంగెడ వద్ద పన్నులు చెల్లించకుండా తరలి వెళ్తున్న గ్రానైట్ లారీలను కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. బిల్లులు చూపాలని లారీ డ్రైవర్లను కోరగా.. అధికారులతో వారు వాదనకు దిగారు. దీంతో కమర్షియల్ ట్యాక్స్ సిబ్బంది జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. పోలీసులు తంగెడ రాష్ట్ర చెక్ పోస్టు వద్దకు చేరుకొని లారీలను నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించారు. కమర్షియల్ ట్యాక్స్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో దాచేపల్లి ఎస్ఐ సౌందర్‌రాజన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తురకా కిశోర్‌పై..
హత్యాయత్నం కేసు నమోదు

మాచర్ల రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ తురకా కిశోర్‌పై మాచర్ల రూరల్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మండలంలోని ముత్యాలంపాడుకు చెందిన టీడీపీ నేత సంచుల నాగేశ్వరరావుపై 2023 ఏప్రిల్‌లో కిశోర్, శీలం శ్రీహరినాథరెడ్డి మరికొందరితో కలిసి మారణాయుధాలతో దాడి చేశారు. ఆ సమయంలో పోలీసులు నాగేశ్వరరావు ఫిర్యాదును స్వీకరించలేదు. ఈ నెల 23న నాగేశ్వరరావు మరోమారు మాచర్ల రూరల్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో రూరల్ ఎస్ఐ సంధ్యారాణి.. హరినాథరెడ్డిని అదుపులోకి తీసుకొని గురువారం మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచగా న్యాయమూర్తి ప్రశాంత్ 14 రోజులపాటు రిమాండ్ విధించారు. త్వరలోనే కిశోర్‌ను కూడా మాచర్ల కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లికేనా వందనం

(5వ పేజీ తరువాయి)

వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అమలుకు నోచుకోని మంత్రి లోకేశ్ హామీ..

తల్లి మృతి చెందితే తండ్రి బ్యాంకు ఖాతాల్లోకి పథకం డబ్బును జమ చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. అయితే ఈ హామీ అమలు కాకపోవడంపై లబ్ధిదారుల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఉదాహరణకు బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలో తల్లిని కోల్పోయిన విద్యార్థులు 20 మంది దాకా ఉన్నారని తల్లికి వందనం పథకం కోసం వారి తండ్రులు అర్జీలు దాఖలు చేసినట్లు సమాచారం. అంటే మూడు జిల్లాల పరిధిలోని 20 నియోజకవర్గాల్లో ఎంతమంది ఉంటారో తెలియాల్సి ఉంది. ఒక్కో గ్రామంలో ఇద్దరు ముగ్గురు ఇలాంటి వారు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తండ్రి ఖాతాకు నగదు జమ చేశారని అయితే ఈ ప్రభుత్వంలో అది అమలు కాలేదని పలువురు వాపోతున్నారు.

వైసీపీ నిర్వాకంతో సింగపూర్‌తో దెబ్బతిన్న సంబంధాలు

● రాజధాని పర్యటనలో మంత్రి నారాయణ

తుళ్లూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై కొంత మంది పనిగట్టుకొని చేస్తున్న దుష్ప్రచారాలు నమ్మవద్దని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజలకు, అమరావతి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మూడేళ్లల్లో కచ్చితంగా నూటికి నూరు శాతం రాజధాని పనులు పూర్తి చేసి తీరుతామన్నారు. అమరావతిలో జరుగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను మంత్రి సీఆర్డీఏ ఇంజనీర్లతో కలసి శుక్రవారం పరిశీలించారు. నేలపాడులోని నాన్ గెజిటెడ్, గెజిటెడ్, టైప్ 1, 2, గ్రూపు -డి ఉద్యోగుల క్వార్టర్లను ఆయన సందర్శించారు. గుత్తేదారు సంస్థల ప్రతినిధులను అడిగి పనులు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం అమరావతిపై కక్షతో తీసుకున్న నిర్ణయాలను సరిదిద్దేందుకు ఏడాది పట్టిందన్నారు. పాత టెండర్లు రద్దు చేయలేదని, కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించలేదన్నారు. న్యాయ పరమైన సమస్యలు రాకుండా కమిటీలు వేసి అన్ని పరిష్కరించాల్సి వచ్చిందని వివరించారు. మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాల పటిష్టత విషయంలో ఐఐటీ చెన్నై, ఐఐటీ హైద్రాబాద్ నిపుణులతో కమిటీ వేసి, ఎట్టకేలకు అన్ని నివేదికల ఆధారంగా తిరిగి కొత్తగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. మొత్తం 4 వేల ఉద్యోగుల ఫ్లాట్లతో ఒక టౌన్‌షిప్ తయారు కానుందన్నారు. అన్ని వసతులు కల్పిస్తున్నాన్నట్లు మంత్రి చెప్పారు. ఎస్ఆర్ఎం, వీఐటీ యూనివర్సిటీలు అమరావతిలో మెడికల్ కాలేజీలు నెలకొల్పుతాయని తెలిపారు. ఈ యూనివర్సిటీల నుంచి రెండు హాస్పిటల్స్ వచ్చే మార్చికి, రెండు సీబీఎస్ఈ స్కూల్స్ వచ్చే విద్యా సంవత్సరం అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులు... మొదలు పెడుతున్నట్లు పురపాలక శాఖ మంత్రి వెల్లడించారు. ఇప్పటికే టెండర్లు కేటాయించినట్లు చెప్పారు.



గ్రూపు డీ ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

గత ప్రభుత్వ వేధింపులు..

గత ప్రభుత్వానికి ఒక నగర నిర్మాణం ఎలా చేయాలో అవగాహన లేదని నారాయణ విమర్శించారు. 2014 -19 మధ్యలో సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నామని గుర్తుచేసిన ఆయన.. ఆ దేశ ప్రధాని ఇతర అధికారులతో చర్చించి కమిటీలు వేసి, అమరావతి అభివృద్ధి కోసం ముందుకెళ్లామని చెప్పారు. రాజధానిలో 1,450 ఎకరాలు భూమిని స్విస్ ఛాలెంజ్ విధానంలో 42 : 58 నిష్పత్తిలో కేటాయించామని, దీనివల్ల అమరావతికి కంపెనీలు, బ్యాంకులు వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగాలు వచ్చేవని చెప్పుకొచ్చారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం సింగపూర్ అధికారులపై కేసులు పెట్టిందని, అక్కడికి వెళ్లి మరీ వారిని వేధించారన్నారు. దీంతో సింగపూర్ ప్రభుత్వానికి ఏపీ సర్కార్‌కు మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని మంత్రి వివరించారు. సింగపూర్ పర్యటనలో ఏపీ ప్రభుత్వంపై ఉన్న ముద్ర పోగొట్టుకునేలా సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సమావేశాలు జరుగుతాయన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి శూన్యం

● ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రారంభించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

సత్తెనపల్లి జూలై 25(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో అభివృద్ధి శూన్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నకిలీ మద్యంతో ప్రజల జీవితాలతో జగన్ ఆడుకున్నారని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో రూ.2వేల కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కొండమోడు- పేరేచర్ల జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయని, రాష్ట్రంలో మిగిలిన రోడ్లను కూడా అభివృద్ధి చేస్తామని మంత్రి జనార్దన్‌రెడ్డి చెప్పారు. అగస్టు 15 నుంచి మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పెంపుడు తండ్రి హత్య కేసులో.. కొడుక్కి జీవిత ఖైదు

పిడుగురాళ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన ముచ్చు యోహాన్ హత్య కేసులో ముద్దాయి అంబేడ్కర్‌కు యావజ్జీవ శిక్ష ఖరారు చేస్తూ గురజాల 10వ అదనపు కోర్టు ఇన్‌చార్జ్ న్యాయాధికారి ఆర్.శరత్‌బాబు శుక్రవారం తీర్పునిచ్చారని అదనపు జిల్లా కోర్టు ఏపీపీ కందిమళ్ల సూర్యరాజు తెలిపారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ విశ్రాంత ఉద్యోగి ముచ్చు యోహాన్ గాంధీ నగర్ 2వ లైన్‌లో భార్య చిట్టెమ్మతో కలిసి నివాసం ఉంటున్నాడు.. వీరికి సంతానం లేకపోవడంతో చిట్టెమ్మ బావ రెండవ కుమారుడు అంబేడ్కర్‌ను చిన్నతనం నుంచి పెంచుకొని చిట్టెమ్మ సమీప బంధువైన సుమలతతో వివాహం జరిపించారు. అంబేడ్కర్‌కు ఇద్దరు సంతానం. వ్యసనాలకు బానిసైన అంబేడ్కర్ హైదరాబాద్ నగరంలో పలు దొంగతనాల కేసుల్లో జైలు జీవితం గడిపాడు. అతను తిరిగి వచ్చాక పిడుగురాళ్లలో ఉన్న రెండు అంతస్తుల భవనంలో కొంత భాగం అంబేడ్కర్ భార్య సుమలత పేరిట యోహాన్ రిజిష్ట్రేన్ చేశారు. మిగిలినది కూడా తన భార్య పేరున రిజిస్ట్రేషన్ చేయాలని యోహాన్‌ను అంబేడ్కర్ ఒత్తిడి తీసుకొచ్చినా.. ఆస్తి రాసివ్వలేదు. దీంతో పగబట్టిన అంబేడ్కర్ 2024న ఫిబ్రవరి 24న యోహాన్ ఇంటి బయటకు వెళ్తుండగా కత్తితో పొడిచి హత్య చేశాడు. అడ్డుకోబోయిన భార్య చిట్టెమ్మకు కూడా గాయాలయ్యాయి. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి సీఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. న్యాయాధికారి ఆర్.శరత్‌బాబు అంబేడ్కర్‌కు జీవిత ఖైదు, రూ.500 జరిమానా, చిట్టెమ్మను గాయపరిచిన కేసులో పదేళ్ల శిక్షతో పాటు రూ.500 జరిమానా ఏకకాలంలో అనుభవించేలా తీర్పు వెల్లడించారు. కందిమళ్ల సూర్యరాజు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఊరకుంటలో భారీ మొసలి



ఊరకుంటలో సంచరిస్తున్న భారీ మొసలి

దుర్గి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దుర్గి శివారులో ఉన్న ఊరకుంటలో శుక్రవారం భారీ మొసలి ప్రత్యక్షమైంది. దీన్ని చూసిన కొందరు యువకులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. గ్రామ సమీపంలోనే ఊరకుంట ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రజకులకు ఆరాధ్యదైవం మడేలయ్య స్వామి గుడి ఇక్కడే ఉంది. పశువులు, జనసంచారం ఇక్కడ ఎక్కువగా ఉంటుంది. గ్రామస్థులు మొసలి బారిన పడకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు, రేపు టైప్ పరీక్షలు

రేపల్లె, జూలై25(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లోని 36 కేంద్రాల్లో టైప్ రైటింగ్ పరీక్షలు శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నామని ఏపీ టైపింగ్ షార్టుహ్యాండ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీవీ మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇంగ్లీషు, తెలుగు, హిందీ భాషాల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు, ఇంగ్లీషు జూనియర్ గ్రేడ్, ఇంగ్లీషు, తెలుగు హైస్పీడ్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేపల్లె, తెనాలి, గుంటూరు, నరసరావుపేట కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మంది పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. రేపల్లె కేంద్రంలో ఆదివారం జరిగే వివిధ గ్రేడుల్లో 54 మంది పరీక్షలకు హాజరవుతారని చెప్పారు.



సీవీ మోహన్‌రావు

29 నుంచి దక్షిణాది రాష్ట్రాల..
నవోదయ విద్యార్థులకు యోగా పోటీలు

● 77 విద్యాలయాలు, 336 మంది విద్యార్థులు

చిలకలూరిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల నవోదయ విద్యాలయ విద్యార్థుల యోగా పోటీలకు చిలకలూరిపేట మండలం మద్దిరాలలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయం వేదిక కానుంది. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ పోటీలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరిల్లోని 77 ఎన్‌వీల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను కృష్ణ, ఖమ్మం, కడప, తుమకూరు, షిమోగా, బీదర్, పతనం తిట్ట, వాయినాడు అనే 8 క్లస్టర్లుగా విభజించి, పోటీలు నిర్వహిస్తారు. ప్రతి క్లస్టర్ నుంచి 42 మంది బాలబాలికల చొప్పున మొత్తం 336 మంది విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. మద్దిరాల విద్యాలయంలోనే ఆగస్టులో నవోదయ విద్యాలయాల జాతీయ యోగా పోటీలను నిర్వహిస్తారు. ప్రస్తుత పోటీలలో ఎంపిక చేసే విద్యార్థులకు జాతీయ యోగా పోటీల్లో పాల్గొనేందుకు వీలుగా ప్రత్యేక శిక్షణను ఇవ్వడం జరుగుతుందని విద్యాలయం ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మెడికిల్ ప్రాక్టీషనర్లు

(5వ పేజీ తరువాయి)

ముదిరిపోయిన తర్వాత ఆర్ఎంపీలు చేతులు ఎత్తేస్తున్నారు. అప్పుడు వైద్యశాలలకు వెళ్తుండగా రోగులు మరణిస్తున్నారు. రోగం ఒకటైతే ఆర్ఎంపీలు వాడిన మందుల ప్రభావంతో సరికొత్త రోగం సోకిందని వైద్యులు గుర్తిస్తున్నారు. సీజన్ల వ్యాధులతో వచ్చే రోగులే లక్ష్యంగా ఆర్ఎంపీలు ఇష్టారీతిన వైద్యం అందిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రోగ లక్షణం గుర్తించకుండా స్టెరాయిడ్స్ ఇస్తూ తాత్కాలిక ఉపశమనం కలిగిస్తున్నారని వైద్యులు చెప్తున్నారు. అది చివరకు ముదిరి రోగి ప్రాణాలపైకి వస్తోందంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారిని పర్యవేక్షించాల్సిన డీఎంహెచ్‌వో వంటి వారు సైతం చూసీచూడనట్లుగా ఉంటున్నారు. వైద్యశాఖాధికారుల సూచనలతో విజిలెన్స్ అధికారులు దాడులు చేయాల్సి ఉన్నా ఇంతవరకు ఎక్కడా ఆ దాఖలాలే లేవు.

● చేబ్రోలులో 26 ఏళ్ల మహిళ జ్వరంతో స్థానికంగా ఆర్ఎంపీని ఆశ్రయించి చికిత్స తీసుకున్నారు. ఆర్ఎంపీ వైద్యం వికటించి చివరకు రక్తపు వాంతులు కావడంతో జీజీహెచ్‌కు తరలించారు. గంటల వ్యవధిలోనే ఆమె మృతి చెందింది.



యడ్లపాడులోని మెడికల్ షాపు వద్ద బాలిక మృతదేహంతో నిరసన తెలుపుతున్న బంధువులు(ఫైల్)

● దుగ్గిరాలకు చెందిన ఓ బాలిక ఇటీవల వాంతులు, విరేచనాలతో స్పృహ కోల్పోగా తెనాలిలోని జిల్లా ప్రభుత్వవైద్యశాలకు కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. ఆర్ఎంపీ మూడు రోజులుగా చికిత్స చేసినా తగ్గలేదని వైద్యులకు వివరించారు. దీంతో బాలికను గుంటూరు పెద్దాస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

వినుకొండటౌన్, జూలై 25, (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడడంతో.. వాహనదారుడు మృతి చెందిన ఘటన పట్టణంలో మార్కాపురం రోడ్డులోని వజ్రం రెస్టారెంట్ వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కురిచేడు మండలం వీరాయిపాలెం గ్రామానికి చెందిన రామినేడి చిన్న సుబ్బయ్య (49) వినుకొండ మండలం పెద్ద కంచర్ల గ్రామంలో బంధువుల కార్యక్రమానికి వెళ్లి వస్తుండగా.. ప్రమాదం చోటు చేసుకుంది. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై సమీర్ బాషా తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేట లీగల్, జూలై 25,(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావడంతో.. పట్టణానికి చెందిన నీలం పద్మావతికి దిగువ కోర్టు విధించిన ఏడాది జైలు శిక్ష, రూ.7లక్షలు ఫిర్యాదారుకు చెల్లించేలా దిగువ విధించిన తీర్పును యథాతదంగా అమలు చేసేలా.. స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. పట్టణానికి చెందిన ఏనుగుంటి వెంకటేశ్వర్లు వద్ద పద్మావతి 2014 సెప్టెంబర్ 14న రూ.4.50 లక్షలు అప్పుగా తీసుకుని, రూ.35 వేలు చెల్లింపుగా నగదు చెక్కు ఇచ్చింది. వెంకటేశ్వర్లు బ్యాంకుకు వెళ్లగా చెక్కు చెల్ల లేదు. దీంతో అతను కోర్టును ఆశ్రయించాడు. అనంతరం వెంకటేశ్వర్లు మరణించడంతో అతని వారసులు కేసును కొనసాగించారు. నేరం రుజువు అవడంతో దిగువ కోర్టు 2022 నవంబర్ 21న నిందితురాలికి జైలు శిక్ష, నష్టపరిహారం విధిస్తూ తీర్పునిచ్చింది. అయితే పద్మావతి ఈ తీర్పుపై జిల్లా కోర్టులో అప్పీలు చేసుకుంది.

తాడేపల్లి టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి కొనసా గుతోంది. ఎగువన ఉన్న ప్రధాన వాగులు వజినేపల్లి నుంచి 1331, వెలగలేరు నుంచి 935, కీసర నుంచి 24523, పాలేరు నుంచి 1140 మొ త్తం వరద నీరు 27,929 క్యూసెక్కు లు ప్రకాశం బారేజీ రిజర్వాయర్ వద్ద కు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్(కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

38,350 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 34,695 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,350 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 4,416 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13400	334	9500	12800
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13600	273	---	---
4884	----	----	341	10000	13600
సూపర్ 10	---	----	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12400
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	4500	7000

ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

● వెలుగు పీడీ ఝాన్సీరాణి

సత్తెనపల్లి రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొదుపు సంఘాల సభ్యులకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిదేనని వెలుగు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి అన్నారు. మండలంలోని ధూళిపాళ్ళ భాగ్యనగర్ కాలనీలోగల మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎంలు, సీసీలు, వీఓఏలతో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మహిళలు మంచి యూనిట్లను ఎంచుకుని బ్యాంకు ద్వారా రుణాలు పొంది ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. జీవనోపాధులు, ఉన్నతి, బ్యాంకు లింకేజి, ఎంసీపీ, ఏసీఎల్పీ, సూర్యఘర్, ఉల్లాస్, ఐబీ, స్త్రీనిధి గురించి అధికారులు, సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీపీఎం డేవిడ్, ఐబీ ఆఫీసర్ శ్రీనివాస్, బ్యాంకు లింకేజీ ఆఫీసర్లు శ్రీనివాస్, మల్లేశ్వరి, ఏపీఎంలు సునీత, కృష్ణప్రియ, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



మిర్చినారును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త నగేష్, ఉద్యానశాఖ అధికారులు

మిర్చినారు పెంపకంలో విత్తనశుద్ధి తప్పనిసరి

సత్తెనపల్లి రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): మిర్చినారు పెంచే రైతులు, నర్సరీ యజమానులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని డాట్‌సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ అన్నారు. మండలంలోని ధూళిపాళ్ళలోని రైతుసేవా కేంద్రంలో నర్సరీ యజమానులకు, రైతులకు మిర్చి నారు పెంపకంలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై శుక్రవారం అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి చేసుకోవడం ఎలా, వైరస్ తెగులు, రసంపీల్చు పురుగుల నివారణకు చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఉద్యానశాఖ అధికారి ఎస్ సురేష్ మాట్లాడుతూ నర్సరీ యజమానులు లైసెన్స్, 7రకాల రిజిష్టర్‌లను కలిగి ఉండాలన్నారు. నర్సరీ చట్టాన్ని అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. 2025-26 సంవత్సరానికి మిర్చికి ఎకరాకు రూ.360 ప్రీమియం చెల్లిస్తే పంట నష్టపోతే రూ.90వేల వరకూ కవరేజ్ వస్తుందన్నారు. ముందుగా అధికారులు ధూళిపాళ్ళ, కంకణాలపల్లి, వెన్నాదేవి గ్రామాలలో నర్సరీలను సందర్శించి మిర్చి నారును పరిశీలించారు. కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్‌జిల్లా కో-ఆర్డినేటర్ మస్తాన్‌వలి, జీడీసీసీబీ చైర్మన్ కంచేటి సుబ్బారావు, గ్రామ ఉద్యానసహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన వసతి సక్రమంగా ఉండాలి

● డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేక అధికారి ఝాన్సీ రాణి

నకరికల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): హాస్టల్లో బాలికలకు భోజన, వసతి సౌకర్యాలు సక్రమంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ పీ ఝాన్సీరాణి ఆదేశించారు. బాలికలకు ఎలాంటి అసౌకర్యం కలిగించినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె పాఠశాలల్లో హాస్టల్స్‌ను తనిఖీ చేశారు. దేచవరం మోడల్ స్కూల్లో రికార్డులు, హాజరు పరిశీలించారు. విద్యార్థుల భోజనాన్ని, వంట పాత్రలను తనిఖీ చేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంద్రకళ, ఝాన్సీరాణికి వివరాలను తెలిపారు. నకరికల్లు రామదాసు కాలనీలోని ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలను ఝాన్సీరాణి పరిశీలించారు. పాఠశాలలో సమస్యలను వారు వివరించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో తరగతి గదులే రాత్రి విశ్రాంతి గదులుగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఆయా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు ఝాన్సీరాణి తెలిపారు. ఎంపీడీవో జీ కాశయ్య డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ ప్రసాద్, పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

ఆట్యాపాట్యా జూనియర్ టీం ఎంపికలు

నకరికల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): నకరికల్లు వంగా వెంకటరెడ్డి జడ్పీ హైస్కూల్లో ఈ నెల 27వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి జూనియర్ ఆట్యా పాట్యా ఎంపికలు జరుగుతాయని పీడీ జీ ఝాన్సీరాణి తెలిపారు. పల్నాడు జిల్లా ఆట్యా పాట్యా అసోసియేషన్ సెక్రటరీ ఉస్నం రోహిత్ జోయల్ పర్యవేక్షిస్తారని వివరించారు. పోటీల్లో పాల్గొనే బాలురు వయసు, ఎత్తు, బరువుతో 270 పాయింట్లు కలిగి ఉండాలని, బాలికలు 260 పాయింట్లు కలిగి ఉండాలని తెలిపారు. వివరాలకు 9949533234 నెంబర్లో సంప్రదించాలన్నారు.

అన్నదాతల ఆశాసౌధం బుగ్గవాగు రిజర్వాయర్

● ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కాంతారావు

రెంటచింతల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల ఆశాసౌధం బుగ్గవాగులో రెండు నూతన గేట్ల ఏర్పాటు పనులు చివరి దశకు చేరాయని శనివారం రాత్రి కల్లా పూర్తి చేయడం జరుగుతుందని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు స్పష్టం చేశారు. వరుసగా శుక్రవారం నూతన గేట్ల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డీసీ చైర్మన్లు చావా రామారావు, యాగంటి రామారావు, గనిపల్లి శ్యాం, పి.శివనాగు, మద్దినేని లక్ష్మీనారాయణ, చిన్నం అమరలింగయ్య పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరాఖాస్తు చేసుకోండి..

క్రోసూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ క్రోసూరు ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ కోఆర్డినేటర్ డీ అంజిరెడ్డి శుక్రవారం తెలిపారు. పదవ తరగతి పైన విద్యార్హతలు ఉన్నా 15 నుంచి 45 సంవత్సరాల లోపు యువత దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. శిక్షణ కాలం రెండు నెలలు ఉంటుందని, కష్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్ కోర్సులో 30మంది, డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్ కోర్సులో 60మందికి శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు 30వ తేదీలోగా ఆధార్‌కార్డు, విద్యార్హత మార్క్స్‌మెమో, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో దరఖాస్తుచేసుకోవాలన్నారు. వివరాలకు 77798 58789 నంబరులో సంప్రదించాలన్నారు. శిక్షణ పూర్తియిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం

● ఆర్‌అండ్‌బీ శాఖా మంత్రి జనార్ధన్‌రెడ్డి



శంకుస్థాపనలో మంత్రి జనార్దన్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆర్‌అండ్‌బీ శాఖా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సొసైటీకాలనీలో రూ.56 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాళపాటి శ్రీధర్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డితో కలిసి ప్రారంభించారు. అలాగే రూ.23లక్షలతో నూతనంగా ఏర్పాటుచేయనున్న సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించబోతున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, వైస్‌చైర్‌పర్సన్ యర్రాకుల సిద్ధమ్మసిద్ధయ్య యాదవ్, కేసీపీ జీఎం రమణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, యెనుముల కేశవరెడ్డి, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, రాజబోయిన మధు, కంభంపాటి అనిల్, శాంతినాయుడు, పిన్నెల్లి మధుసూదన్‌రెడ్డి, బూసా రామాంజినేయులు, షేక్ సుభానిసాహెబ్, పోలూరి నరసింహారావు, చల్లా రాజారత్నం, మూరబోయిన శ్రీహరి యాదవ్, భాగ్యం హనుమంతు పాల్గొన్నారు. అనంతరం వెల్దుర్తి మండలంలోని రచ్చమలపాడు గ్రామానికి రూ.1.30 కోట్లతో నూతన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

చెప్పింది చేస్తా.. అభివృద్ధి చూపిస్తా

● రూ.3.69 కోట్ల నిధులతో శంకుస్థాపన

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంతో తమకు 30 ఏళ్ల అనుబంధం వుందని, ఏనాడైనా ఏదైనా ఒకటి చెప్పానంటే ప్రజల కోసం, గురజాల అభివృద్ధి కోసం చెప్పింది చేస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలో రూ.3.69కోట్లకు పైగా నిధులతో వివిధ వార్డులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురజాల అభివృద్ధే తమ ధ్యేయమని యరపతినేని తెలిపారు. ఏడాది పాలనలో తాగునీటి అవసరాలకు, గురజాల, పిడుగురాళ్ల, దాచేపల్లి పట్టణాభివృద్ధికి సుమారు రూ.400 కోట్లు మంజూరయ్యాయన్నారు. వాటితో రాబోయే ఏడాదిలో పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. దశల వారీగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. ప్రస్తుతం నిర్మాణంలో వున్న మున్సిపల్ కార్యాలయ భవనానికి 2017లో తానే రూ.2కోట్ల నిధులు మంజూరు చేయించానని, వైసీపీ హయాంలో నిర్మాణపనులు సగంలోనే ఆపేశారని చెప్పారు. ఇప్పుడు ఆ భవనానికి తాను రూ.50లక్షల నిధులు సమకూర్చి పూర్తిచేయిస్తున్నానన్నారు. అనంతరం నిర్మాణంలో వున్న మున్సిపల్ కార్యాలయ నూతన భవనాన్ని అధికారులతో కలిసి పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం దివ్యాంగుడితో ఎమ్మెల్యే ముచ్చటించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కల్లం రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, పాండురంగ శ్రీను, వున్నం నాగమల్లికార్జునరావు, వి.సర్వేశ్వరరావు, షేక్ బాబావలి, వున్నం వెంకట్రావు, వి.సాంబశివరావు, పిల్లి చెన్నారావు, కె.శ్రీను, పి.రవి, డి.రామకృష్ణ, ఎల్‌వీఆర్, ఈ శశికుమార్, కె.అంకారావు, కె.రమేష్, ఖాశింసైదా, మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు, పబ్లిక్ హెల్త్ డీఈ గడిపూడి వెంకటేశ్వర్లు, ఏఈ రోహిణి పాల్గొన్నారు.



పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ప్రజల అవసరాలకే ప్రాధాన్యం

పిడుగురాళ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పట్టణాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రాత్రి 15, 18 వార్డుల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపడుతున్న పథకాలను వివరించడంతో పాటు పింఛన్ల పెంపు, ఆగస్టు నుండి భర్త చనిపోతే అదే పింఛన్‌ను భార్యకు మంజూరవుతుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వస్తుందన్నారు. అర్హత కలిగిన కొత్త పింఛన్లకు కూడా త్వరలోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కల్లం రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, కనిగిరి శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, పల్నూరి ధనుంజయ, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, నల్లాటి సుబ్బారావు, పిల్లి చెన్నారావు, పణితి రవి, గోళ్ల కిరణ్, మూల్పూరి వెంకట్రామయ్య, తదితరులు పాల్గొన్నారు.




రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి అరుణ

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి అరుణ

మాచర్ల రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువులను వినియోగిస్తే నేల సారవంతంగా ఉంటుందని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి అరుణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా వనరుల కేంద్రంలో నిర్వహించిన రైతు శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో పాపకుమారి, వ్యవసాయ విస్తరణాధికారి ఎం మార్కండేయులు, జి ప్రతాప్‌కుమార్, అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.



వంటగదిని తనిఖీ చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

● స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు

క్రోసూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ప్రత్యేక అధికారి కే శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం క్రోసూరు కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. వంటగదిని, మరుగుదొడ్లను, పాఠశాల అవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి విద్యాప్రమాణాలను పరిశీలించారు. తరగతి గదులను నిశితంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో రవికుమార్, ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, తదితరులు ఉన్నారు.

ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి

సత్తెనపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాలూకా ఆవరణంలో రూ.75లక్షల వ్యయంతో నిర్మించిన డివిజనల్ ఉపఖజానా కార్యాలయాన్ని, రూ.3కోట్ల40లక్షలతో నిర్మించిన ఆర్‌అండ్‌బీ అతిధిగృహాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలిసి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు యెలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, చౌటా శ్రీనివాసరావు, కనుమూరి బాజీచౌదరి, భీమినేని వందనాదేవి, కోమటినేని శోభారాణి, మస్తాన్‌వలి, జాన్‌బాబు, భావన్నారాయణ పాల్గొన్నారు.



ఉప ఖజానా కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

కేకు పంపిణీ

కూటమిలో భాగస్వామి అయిన జనసేన నాయకుల కోరిక మేరకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విజయవంతమైనందుకు మంత్రి జనార్ధన్‌రెడ్డి కేక్‌ను కట్‌చేసి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు, కూటమి నేతలకు పంపిణీ చేశారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

సత్తెనపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



సత్తెనపల్లి: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని పూలతో అలంకరించిన దృశ్యం

శాకంబరిగా కనకదుర్గమ్మ

పిడుగురాళ్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని దేవాలయాలు పూజా కార్యక్రమాలు, అభిషేకాలతో కళకళలాడాయి. స్థానిక కనక దుర్గ అమ్మవారిని శాకంబరిగా విశేష అలంకరణ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా నదీ జలాలతో మహిళలు తరలివచ్చి గంగమ్మతల్లికి అభిషేకాలు చేశారు. ఆయా కార్యక్రమాలలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అంకాళమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

కారంపూడి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని అంకాళమ్మ అమ్మవారిని నిమ్మకాయల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు అమ్మవారిని దర్శించుకొని కుంకుమ పూజలు నిర్వహించారు.

అచ్చంపేటలో సుపరిపాలన తొలి అడుగు

అచ్చంపేట జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్చంపేటలోని 51, 54, 57, 58 బూత్‌లలో శుక్రవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. మండల టీడీపి అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పై నాలుగు బూత్‌లలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అచ్చంపేట అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలో సీసిరోడ్లతో పాటు కాలనీలలో డ్రైనేజి లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదంతో పాటు డిసి చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, తిరువాయిపాటి అంజనేయులు, కోట చంటి, అన్నవరపు శివశంకర్, అడ్డగిరి శివశంకర్, బత్తుల గోపి, ఆర్‌యంపి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రేపు పరసతాళ్లూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా రత్నకుమార్ ప్రమాణ స్వీకారం



ఏటుకూరి రత్నకుమార్

పెదకూరపాడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్లూరులో పరసతాళ్లూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ఏటుకూరి రత్నకుమార్ ఈనెల 27వ తేదీ ప్రమాణ స్వీకారం చేస్తారని సీఈఓ ఎం.శివకుమారి శుక్రవారం తెలిపారు. పర్సన్స్‌గా బండి అప్పారావు, కల్లం సుందరరామిరెడ్డిలు కూడా ప్రమాణ స్వీ కారం చేస్తారని వివరించారు. సహకార సంఘంలోని సభ్యులందరూ ఈ మహోత్సవంలో పాల్గొనాలని కోరారు.

ఈ గుంతలలో ప్రయాణమెలా..?

● అమరావతి-బెల్లంకొండ రోడ్డు దుస్థితి

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆర్భాటంగా అప్పటి ఎంఎల్‌ఏ నంబూరు శంకరరావు 2023 జూన్ 29న శంకుస్థాపన చేసిన అమరావతి-బెల్లంకొండ రోడ్డు నిర్మాణపనులు నత్తనడకగా సాగాయి. సంవత్సర కాలంలో ఎన్నికలు పూర్తయ్యేసరికి రహదారి మధ్యలో ఉన్న వాగులపై చప్టాలు నిర్మించేంతవరకు నిర్మాణం సాగింది. రహదారిని డబుల్ రోడ్డుగా వేసేందుకు రోడ్డుకు ఇరువైపుల మెటల్ వేసి బీటీ వేయకుండా నిలిపివేశారు. దీంతో వాహనాల రాకపోకలతో గతంలో ఉన్న రోడ్డు నూతనంగా వేసిన మెటల్ రోడ్ గుంతలు పడి వాహనదారులకు నరకయాతన కలిగిస్తుంది. ఈ రహదారిలో వైసీపీకి అనుకూలంగా ఉన్న గ్రామాలలో సీసీ రోడ్లు వేశారు. మిగిలిన రోడ్డు భారీ గుంతలు పడి చిన్నచిన్న తటాకాలుగా దర్శనమిస్తున్నది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తైనా ఈ రోడ్డు నిర్మాణానికి పూనుకోలేదు. పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతి, క్రోసూరు, అచ్చంపేట, బెలంకొండ మండలాల ప్రజలకు ఉపయోగపడే ఈ రోడ్డు నిర్మాణం ఆగిపోవడంతో ఆ నాలుగు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



తటాకాలను తలపిస్తున్న అమరావతి-బెల్లంకొండ రహదారి



సంక్షిప్తం...

● దాచేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2.25 కోట్లు మంజూరైనట్లు కమిషనర్ జి.వెంకేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ నిధులను రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులు, కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు వినియోగించనున్నారు.

● దుర్గి: మండలంలోని దుర్గి మెయిన్ మోడల్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవోలు ఎండీ ఖాసీం, డీ బెంజిమెన్‌లు తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవిందరాజులునాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మాచవరం: రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న సబ్సిడీ రెండో సిలిండర్‌ను ఈ నెలాఖరులోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరుతో రెండో సబ్సిడీ సిలిండర్ తేదీ ముగుస్తుందన్నారు.

● పిడుగురాళ్ల: చినఅగ్రహారం గ్రామానికి చెందిన వెన్నా వెంకట్రామిరెడ్డికి చెందిన వరిగడ్డి వామికి గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. టీడీపీ మండల కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు, గ్రామానికి చెందిన మేకల రాంబాబుతో పాటు పలువురు వెంకట్రామిరెడ్డికి రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు.

● ముప్పాళ్ళ: తెలుగు రాష్ట్రాలలోని ప్రతి మాదిగ పల్లెలో ఎమ్మార్పీఎస్ జెండాను వేయాలని జిల్లా అధ్యక్షుడు అద్దంకి బాబు అన్నారు. మండలంలోని గోళ్ళపాడులో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కందుల అంబేద్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం గోళ్ళపాడు ఎస్సీకాలనీ యువకులతో ఎస్సీ రిజర్వేషన్ ద్వారా ఎలా అభివృద్ధి చెందాలో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్, మాతంగి సత్యానందం, గడికొయ్య కాలేబు,పరిమి రత్నం, మాచర్ల అబ్రహం తదితరులున్నారు.

● సత్తెనపల్లి: సత్తెనపల్లి డిపో అభివృద్ధికి తోడ్పడాలని డ్రైవర్‌లను, కండక్టర్లను డిపో మేనేజర్ విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం డిపోలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్‌లను, అత్యధిక ఈసీకే సాధించిన కండక్టర్‌లను బీఎం పూలమాలలతో ఘనంగా సన్మానించి నగదు బహుమతి అందించారు.

● ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) అధ్యక్షుడు మందడి శ్రీహరి సహకారంతో పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాలకు శుక్రవారం నిత్యావసర సరుకులు, కండువాలను అందజేశారు. అనంతరం మొల్లమాంబ వృద్ధాశ్రమంలో ఒకరోజు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో మందడి బాబు, అప్పారావు, ప్రసాదు, మల్లికార్జునరావు, సీతారామయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● నకరికల్లు: శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండ్లపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కుంకలగుంట లోని భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

● రెంటచింతల: స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి శుక్రవారం సీపీఐ మండల కార్యదర్శి కె.రంగనాయకులు అధ్యక్షత వహించారు. ఎంసీపీఐ డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి తిక్కా నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ కన్వీనర్ పి ,సత్తయ్య, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, ఎం.పెదసామ్యేల్, కె.హనుమంతరావు, దేగల జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● నేల ఆరోగ్య పరిరక్షణకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువుల వాడకాన్ని అధికం చేయాలని జిల్లా రైతు శిక్షణా కేంద్రం కో ఆర్డినేటర్ ఎం.శివకుమారి కోరారు. శుక్రవారం రెంటచింతలలో రైతులకు నిర్వహించిన శిక్షణ లో ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో కట్టా లక్ష్మారెడ్డి, ఎంపీవో రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: నరసరావుపేటలో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి కోరారు. పట్టణంలోని శుక్రవారం మహాసభల గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేతావత్ రంగనాయకులు, మిద్దెపోగు బాబురావు, బ్రహ్మాచారి, బత్తిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● దాచేపల్లి: మాదక ద్రవ్యాలు తీసుకోవడం వలన జరుగుతున్న నష్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం దాచేపల్లి ఎస్ఐ పాపారావు ఆధ్వర్యాన మండలంలోని గామాలపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు తీసుకోవడం వలన కలిగే నష్టాలను వివరించారు.

● పెదకూరపాడు: అవధూత అయోధ్యస్వామి 20వ ఆరాధన మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయోధ్యస్వామి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమం కమిటీ నిర్వాహకులు తాటి కోటేశ్వరమ్మ రామకృష్ణ తదితర భక్తులు పాల్గొన్నారు.

● అమరావతి: మండల పరిధిలోని అత్తలూరు గ్రామంలో సిబార్ దంత కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వైద్యశిబిరంలో 102మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. 18మందికి దంతాల సెట్‌ను పంపిణీ చేసినట్లు వైద్యశిబిరం కోఆర్డినేటర్ కృష్ణకిషోర్ తెలిపారు.

● స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న రామలింగేశ్వర స్వామి దుకాణసముదాయంలో ఒకదానిలో మాంసపు ఆహారపదార్థాలు అమ్మకాలు జరుపుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని అమ్మకాలను వెంటనే నిలుపుదల చేయించాలని వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు ఎం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆలయంలో స్వామివారికి సక్రమంగా పూజా కార్యక్రమాలు జరుగుటలేదన్నారు. వీటిపై ఈఓ సూర్యనారాయణకు ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను పరిష్కరించకపోతే వీహెచ్‌పీ జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులతో మాట్లాడి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వలన నిలిచిపోయిన అమరావతి-బెల్లంకొండ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధనరెడ్డికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మంత్రి కార్యాలయంలో అయనను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నిధుల మంజూరుపై మంత్రి సుముఖత వ్యక్తం చేశారని, త్వరలో రోడ్డు పనులు ప్రారంబిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి జనార్ధనరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంఎల్ఏ భాష్యం ప్రవీణ్

ఆమడ దూరంలో.. ఆపదకు అడ్డుగోడ!



సముద్రానికి ఆనకట్టగా నిలిచిన మడ అడవి

- యథేచ్ఛగా నరికివేతతో అంతరిస్తున్న మడ అడవులు
- మడ వృక్షాల పెంపకానికి ప్రభుత్వం కృషి
- తీర ప్రాంతం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 50 వేల మొక్కలు నాటేందుకు సిద్ధం
- తుఫాన్‌లు, సముద్ర తీరం కోత నుంచి రక్షణ

బాపట్ల/రేపల్లె జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాలుష్య కోరల్లో చిక్కుకున్న రాష్ట్రాన్ని కాపాడేందుకు అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. సముద్రతీర ప్రాంతంలో రక్షణ కవచాలుగా పర్యావరణ రక్షణకు దోహదపడే వివిధ రకాల మడ మొక్కలు పెంపకంపై దృష్టి సారించింది. తీర ప్రాంతంలోని బాపట్ల, గుంటూరు జిల్లాల్లో మడ అడవులను అభివృద్ధి చేసేందుకు నడుం బిగిచింది. గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి దేశంలోనే అత్యధిక స్థాయిలో మడ అడవుల పెంపకంలో తీర ప్రాంతం ముందంజలో ఉంది. రాష్ట్ర విభజన అనంతరం గుంటూరు జిల్లాలో రాజధాని ఏర్పాటు చేయడంతో పర్యావరణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాజధాని నిర్మాణాలు పూర్తిస్థాయిలో జరగాలన్నా.. తగినంత పర్యావరణం పెంపుదల ఉండాలి. 10 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గించే విధంగా మడ అడవులు పెరగడం రాజధాని నిర్మాణానికి కూడా దోహద పడుతుందని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వం మడ అడవులపై దృష్టిసారించిన దాఖలాలు లేవు. దీనికితోడు అటవీ భూముల్లో ఇష్టానుసారంగా ఆక్రమణలకు గురిచేసి, మడ చెట్లను నరికివేసి రొయ్యల చెరువులుగా మార్చేసుకున్నారు.

విచక్షణా రహితంగా నరికివేత..

తుపాను తీవ్రత తగ్గించేందుకు, తీర ప్రాంత గ్రామాల్లో భూగర్భ జలాలు క్షారమయం కాకుండా కాపాడేందుకు, వివిధ పక్షి జాతులు, క్రిమికీటకాదులు, చేపలవృద్దిధికి దోహదపడుతున్న మడ చెట్లను తీర ప్రాంతాల్లో విచక్షణా రహితంగా నరికివేస్తున్నారు. తీర ప్రాంతాల్లో దట్టంగా పెరిగి మట్టి కోతను నివారిస్తూ.. సముద్రపు ఉప్పునీటి వల్ల తీరప్రాంత గ్రామాలలో భూగర్భజలాలు ఉప్పు నీరుగా మారకుండా ఈ మడ చెట్లు కాపాడుతుంటాయి. మడచెట్లు సముద్ర తీరాల్లోని ఉష్ణ మండలాల్లో అధికంగా వ్యాప్తి చెందుతాయి. ఇందుకు కారణం ఉప్పునీరు. ఇవి వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతూ మనుషులకు, పక్షులకు, చేపలకు జీవనాధారాన్ని కల్పిస్తున్నాయి. తీర ప్రాంతాల్లో ఈ చెట్లు ఆవాస కేంద్రాలై గొప్ప వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. అనేక పక్షి, మత్స్య జాతులకు మడ అడవులు జన్మస్థావరాలు వీటివల్ల మత్స్యసంపద వృద్ధి చెంది తీరప్రాంత మత్స్యకారులకు జీవనాధారం అందిస్తుంది. ఇలాంటి అమూల్యమైన మడ అడవులను వంట చెరకు కోసం, చేపల, రొయ్యల చెరువుల సాగు కోసం, ఇళ్ల చుట్టూ దడి కట్టేందుకు విచక్షణ రహితంగా నరికివేస్తున్నారు. తమకు పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్న విషయాన్ని మత్స్యకారులు సైతం గ్రహించలేకున్నారు. జిల్లాలో నిజాంపట్నం నుంచి చినగంజాం వరకు 67 స్క్వేర్ కిలోమీటర్ల విస్తీర్ణం మడ అడువులు వ్యాపించి ఉండేవి. గత రెండు దశాబ్దాలుగా నరికివేతకు గురవుతున్నాయి. నిజాం పట్నం అడువుల దీవి, రేపల్లె, కర్లపాలెం, బాపట్ల, మండలాలలో నరికివేతతోపాటు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఎక్కువ భాగం చేపలు, రొయ్యలు చెరువులుగా రూపాంతరం చెందాయి.

50 వేల మొక్కలు సిద్ధం

జిల్లాలో మడ మొక్కలు 50 వేలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. గతంలో 100 హెక్టార్లో మొక్కలు నాటడం జరిగింది. ప్రస్తుతం 200 హెక్టార్లలో నాటారు. ఇంకా మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో సముద్ర తీరప్రాంతం 74 కిలోమీటర్లు విస్తరించగా.. 9,194.28 హెక్టార్లలో మడ అడువులు ఉన్నాయి.

- ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాలకృష్ణ

మడ అడువులు తీరప్రాంతానికి రక్షణ

మడ అడువులు తుఫాన్‌లు, సునామీలు, వరదల నుంచి తీరప్రాంతాలను రక్షిస్తాయి. అనేక జలచరాలు, పక్షులు, ఇతర వన్యప్రాణాలకు నివాసంగా ఉంటాయి. ఇవి కార్బన్‌ను నిల్వ చేసి వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో సహాయపడుతాయి. మడ వృక్షాలు 20 నుంచి 30 అడుగుల ఎత్తు పెరిగి.. అనేక రకాల చేపలు, పక్షులు, వన్యప్రాణులకు ఆవాసంగా ఉంటాయి. సముద్రజీవులకు సంతానోత్పత్తి ప్రదేశాలను కూడా అందిస్తాయి. మత్స్య సంపద, పర్యాటకం, ఇతర వనరులు నుంచి ఆర్థికప్రయోజనాలను అందిస్తాయి. మడ చెట్ల వేర్లు తీరప్రాంతాలను బలోపేతం చేస్తాయి. కోతను తగ్గిస్తాయి. నీటిని శుద్ధి చేయడంలో సహాయపడుతాయి. గతంలో లైలా, ఓగ్ని, ఫైలిన్, లెనిన్, నీలం తుఫాన్‌ల నుంచి ఈ మడ అడవులు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎలాంటి నష్టం సంభవించకుండా అడ్డుగోడగా నిలిచాయి. 2012లో సంభవించిన నీలం తుఫాన్ రేపల్లె మండలం లంకెవానిదిబ్బ సమీపంలోని మడ అడవుల మధ్య చిక్కుకుని బలహీన పడి తీరం దాటిన సంగతి విధితమే.

ప్రజలకు అవగాహన కల్పించాలి

రాష్ట్రంలో 23 శాతం అటవీ ప్రాంతం ఉంటే అందులో ఒక శాతం మాత్రమే మడ అడువులు ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా బంటుమిల్లి, కోరింగ ప్రాంతాల్లో కాకినాడ సముద్ర తీరంలో మొత్తం సుమారు 30 వేల హెక్టార్లలో మడ చెట్లు ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 16 వేల హెక్టార్లలో మాత్రమే మడచెట్లు కనిపిస్తున్నాయి. ఈ చెట్లు నరికివేతను అరికట్టాలంటే ప్రభుత్వం మడచెట్లు నరికితే అక్కడికక్కడే జరిమాన విధించాల్సిన అవసరం ఉంది. నిజాంపట్నం, రేపల్లె, బాపట్ల, చినగంజాం తదితర ప్రాంతాల్లో మడచెట్లు పెంచాల్సిన ఆవశ్యకత ఉంది. తరుచూ తుపాను తాకిడిలను ఎదుర్కొంటున్న పై ప్రాంతాల్లో మడచెట్లను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అటవీశాఖాధికారులపై ఉంది. ప్రజలకు పర్యావరణం దాని పరిరక్షణలో సరైన అవగాహన కల్పించాలి. ప్రజల సహకారం లేనిదే ఈ కార్యక్రమం విజయవంతం కాదు.

మడ అడవులను హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామచంద్రప్రసాద్, విజయవాడ మేరీ స్టెల్లా కళాశాల బోటనీ డిపార్టుమెంట్‌కు చెందిన డాక్టర్ ఆశా కుమారి, డాక్టర్ కరుణ మడ అడవులను పరిశీలన చేశారు. మడ వృక్షాల్లో 24 కుటుంబాలు, 75 జాతులు ఉన్నాయి. వీటిలో అధిక సంఖ్యలో వృక్షాలు రైజోఫోరేసి కుటుంబానికి చెందినవి. అవిసేనియా, అఫిసినాలిస్(నల్లమడ), అవిసేనియా మరీన (తెల్లమడ), అవిసేనియా అల్బా(కుడం మడ), రైజోఫోర కాంజుగేటా(పొన్న), రైజోఫోర మూకోనేట(ఉప్పుపొన్న), సొనేరేషియా ఎపెటాల(పెద్ద కళింగ) వంటి జాతులు ముఖ్యమైనవి. చిల్లంగి, నల్లతీగ, కొల్లకూర, దబ్బగడ్డి వంటి మొక్కలు పెరుగుతాయి.



2014లో కృష్ణా వైల్డ్‌లైఫ్‌లో భారీగా మొక్కలు పెరిగిన ప్రాంతం (ఎర్ర రంగులో ఉన్నది అభివృద్ధి చెందిన అడవి)



బాపట్లలోని సూర్యలంక సముద్రతీరంలో పొగురు వద్ద మడ అడువులు



తీరంలో పలచబడిన మడచెట్లు



మడ మొక్కలు నాటుతున్న కూలీలు

పోలీసుల అదుపులో..

సైబర్ క్రైమ్ కీలక నిందితుడు

- విదేశాలకు పారిపోతుండగా ముంబైలో అదుపులోకి..

గుంటూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ సైబర్ క్రైమ్ కేసులో అత్యంత కీలకమైన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సూర్యప్రకాశ్ రెడ్డి విదేశాలకు పారిపోతుండగా ముంబైలో పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. గుంటూరుకు చెందిన సూర్యప్రకాష్‌రెడ్డి కొద్ది సంవత్సరాలుగా హైదరాబాదులో ఉంటున్నారు. దేశ విదేశాల్లోని సైబర్ కేటుగాళ్లతో సంబంధాలు మెరుగుపరచుకొని తద్వారా ఓ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏజెంట్లను నియమించుకొని వారి ద్వారా పేద వర్గాలకు డబ్బు ఆశ చూపి వారి పేరుతో బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నాడు. ఇందుకుగాను ఒక్కో ఖాతా దారుడికి.. రూ.రెండు మూడు వేలు ఇస్తున్నాడు. ఆ విధంగా ఖాతాలు తెరిపించిన తర్వాత వారి బ్యాంకు పాసుబుక్, ఆధార్, ఏటీఎం కార్డు వంటి వాటిని ఏజంట్‌లు నేరుగా సూర్యప్రకాష్‌రెడ్డికి అందిస్తారు. సూర్య ప్రకాష్ రెడ్డి దుబాయ్, చైనా, నేపాల్ తోపాటు మరికొన్ని దేశాల నుంచి సైబర్ నేరాలకు పాల్పడి బాధితుల నుంచి తాము సేకరించిన బ్యాంక్ ఖాతాలకు డబ్బు జమ చేయించుకుంటాడు. ఆ విధంగా ఆయా ఖాతాల్లో జమ అయిన డబ్బును విదేశాల్లో ఉన్న తమ బ్యాంకు ఖాతాలకు మళ్లించుకుని అక్కడ డ్రా చేసుకుంటారు. సూర్యప్రకాశ్‌రెడ్డి నగరానికి చెందిన అనిల్, విష్ణు సుధాకర్ తదితరులను ఏజెంట్లుగా ఏర్పాటు చేసుకొని వీరి ద్వారా గుంటూరుతో పాటు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 500కు పైగా బ్యాంక్ ఖాతాలను తెరిపించాడు. దీనిలో భాగంగా కొరిటెపాడుకు చెందిన కన్సల్టెంట్ రమేష్‌ను ఏజెంట్లు సంప్రదించి.. తన ఖాతా ద్వారా తాము నగదు లావాదేవీలు చేసుకుంటామని.. తద్వారా అతనికి సిబిల్ స్కోర్ పెరుగుతుందని, దీంతో పెద్ద మొత్తంలో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవచ్చంటూ ఆశ కల్పించారు. నిజమేనని నమ్మిన రమేష్ తన బ్యాంకు ఖాతా వివరాలను వారికి ఇచ్చాడు. రమేష్‌ను తమ వెంటబెట్టుకొని బెంగళూరు తీసుకెళ్లారు. అక్కడ రమేష్‌ను వారి వద్ద ఉంచుకొని ఒకే రోజు సుమారు 500కు పైగా నగదు లావాదేవీలు ఆయన ఖాతా నుంచి జరిపారు. దీంతో తన ఖాతాను సైబర్ నేరానికి వినియోగించుకున్నట్లు రమేష్‌కు అర్థమైంది. అక్కడ నుంచి బయటపడేందుకు ప్రయత్నించగా వారు ఆయనను రెండు రోజులు పాటు అక్కడే నిర్బంధించి ఆయన ఖాతా ద్వారా కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహించిన అనంతరం ఆయనను వదిలివేశారు. సైబర్ క్రైమ్‌కు సంబంధించి పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు తన ఖాతా ద్వారా జరగడంతో తాను కేసులో ఇరుక్కుంటానని భయపడిన రమేష్ నేరుగా అరండల్‌పేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేయడంతో సూర్య ప్రకాష్‌రెడ్డికి ఏజెంట్లుగా వ్యవహరించిన సుధాకర్, అనిల్, విష్ణువర్ధన్ తదితరుల బండారం బట్టబయలైంది. వీరితోపాటు నిజామాబాద్‌కు చెందిన రంజిత్, నేపాల్‌కు చెందిన విశాల్ తదితరులను కూడా సూర్యప్రకాశ్‌రెడ్డి నెట్‌వర్క్.. ఇదే విధంగా ఖాతాలు తెరిపించి మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో పోలీసులు ఏజెంట్లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. అయితే హైదరాబాదుకు చెందిన సూర్య ప్రకాష్ రెడ్డి ఈ మొత్తం సైబర్ నేరానికి కీలకమైన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఇప్పటికే లుక్ అవుట్ నోటీసుతోపాటు రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ఈ నెట్‌వర్క్ చెందిన ఆయా ఏజెంట్లను ఇప్పటికే గుంటూరు అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న సైబర్ క్రైమ్ సూత్రధారి సూర్య ప్రకాశ్‌రెడ్డి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా ముంబైలో ఆయనను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఆయనను గుంటూరు తీసుకువచ్చి పూర్తిస్థాయిలో విచారించనున్నారు. సూర్య ప్రకాష్‌రెడ్డిని పూర్తిగా విచారిస్తే రూ.వందల కోట్ల సైబర్ క్రైమ్ లావాదేవీలు వెలుగు చూసే అవకాశం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

గుంటూరు కోర్టు ఉత్తర్వుల ప్రతిని.. మా ముందు ఉంచండి

- పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం ● విచారణ రెండు వారాలకు వాయిదా

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): వారాహి యాత్రలో భాగంగా వాలంటీర్లపై వ్యాఖ్యల విషయంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ప్రాసిక్యూషన్ ఉప సంహరణకు అనుమతిస్తూ గుంటూరు కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రతిని(సర్టిఫైడ్ కాపీ)ని తమ ముందు ఉంచాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. వారాహి యాత్రలో భాగంగా పవన్ కల్యాణ్ మాట్లాడూ... వాలంటీర్లు సేకరించిన సమాచారం అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్తోందని, మహిళలు అపహరణకు గురవుతున్నారన్నారు. ఈ వ్యాఖ్యలపై వైసీపీ ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరిలో ఐపీసీ సెక్షన్ 499, 500 కింద గుంటూరు కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా పవన్ కల్యాణ్ పై క్రిమినల్ కేసు దాఖలు చేసింది. కేసు వేసేందుకు అఫిడవిట్‌లు ఇచ్చిన ఐదుగురు వలంటీర్లు... పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు వల్ల తమ ప్రతిష్ఠకు భంగం కలగలేదని, వైసీపీ నేతలు తమ నుంచి సంతకాలు తీసుకొని పిటిషన్లు వేశారని అఫిడవిట్లు వేశారు. న్యాయాధికారి ముందు వాంగ్మూలం కూడా ఇచ్చారు. దీంతో పవన్ కల్యాణ్ పై ప్రాసిక్యూషన్ ఉప సంహరణకు అనుమతించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుంటూరు కోర్టులో పిటిషన్ వేశారు. దీని పై విచారణ జరిపిన గుంటూరు నాలుగవ అదనపు జిల్లా జడ్జి పవన్ కల్యాణ్ పై ప్రాసిక్యూషన్ ఉపసంహరణకు అనుమతిస్తూ గతేఏడాది నవంబర్‌లో ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సరళ, మరో ముగ్గురు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు.

11వ విడత కౌలు..కొందరికే..!

- 23,384 మంది రైతులకు 18,638 మందికి లబ్ధి
- రూ. 210.44 కోట్లకు.. రూ.163.67 కోట్లు విడుదల
- ప్లాట్లు అమ్ముకోవడంతో అనర్హులైనవారు 6,114 మంది
- వివరణిచ్చిన మంత్రి నారాయణ

గుంటూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతులకు ఎట్టకేలకు ప్రభుత్వం 11వ విడత కౌలు అందించింది. అయితే ఆ ఆనందం రైతుల్లో ఎంతమాత్రం కనిపించలేదు. ఎప్పుడో మే నెలాఖరుకల్లా రావాల్సిన కౌలు రెండు నెలలు ఆలస్యంగా రావడం ఒక కారణం కాగా, ఆ వచ్చిన మొత్తం కూడా అరకొరగా ఉండడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

18,638 మందికే కౌలు

రాజధాని కోసం భూమలిచ్చిన 29,498 మంది రైతుల్లో 23,384 మంది మాత్రమే కౌలు పొందేందుకు అర్హులుగా ఉన్నారు. అయితే వారికి కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో కౌలు చెల్లించలేదు. 18,638 మందికి మాత్రమే కౌలు చెల్లించింది. కిందటేడాది రైతులకు రూ.210.44 కోట్లు కౌలు చెల్లించగా, ఈ ఏడాది కూడా రైతులకు అదేమొత్తంలో కౌలు రావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం మాత్రం రూ.163.67 కోట్ల కౌలు మాత్రమే చెల్లించింది. దీంతో కొంత మంది రైతులకు రావాల్సిన కౌలులో కొంతభాగం మాత్రమే అందింది. మరికొన్ని చోట్ల ఒకే కుటుంబంలో నలుగురు లబ్ధిదారులుంటే ఒకరిద్దరికే కౌలు దక్కింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి నారాయణ వివరణ

కాగా రాజధాని రైతుల కౌలు విడుదలపై మంత్రి నారాయణ గురువారం స్పందించారు. మొత్తం 18,638 మంది రైతులకు రూ.163,67,29,471లు విడుదల చేశామని చెప్పారు. 594 మంది రైతులకు బ్యాంకు కోడ్ తప్పుగా ఇవ్వడంతో నగదు జమ కాలేదని, మరో 88 మంది రైతులకు సీఎఫ్ఎంఎస్‌లో వివరాలు తప్పుగా నమోదు కావడంతో జమ కాలేదని చెప్పారు. పెండింగ్ ఉన్న రైతుల ఇబ్బందులు పరిష్కరించేందుకు సీఆర్డీఏ ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేసిందని ఆయన వివరించారు. అయితే రైతులు మాత్రం మంత్రి నారాయణ ఇచ్చిన వివరణపై సంతృప్తి చెందడం లేదు. గత పదేళ్లుగా ఇస్తున్న రైతుల బ్యాంకు ఖాతాల కోడ్ తప్పుగా నమోదవడమేంటి, సీఎఫ్ఎంఎస్‌లో వివరాలు ఇప్పుడు మారడమేంటని ప్రశ్నిస్తున్నారు.

దారుణంగా దెబ్బతిన్న చిన్నరైతులు

రాజధాని అమరావతికోసం మొత్తం 29,498 మంది రైతులు 34,879 ఎకరాలు భూ సమీకరణ కింద భూములు ఇచ్చారు. వీరికి అప్పటి ప్రభుత్వం తొలిఏడాది కౌలు రూ.149.38 కోట్ల కౌలు చెల్లించింది. రైతులతో సీఆర్డీఏ చేసుకున్న ఒప్పందం ప్రకారం కౌలు ఏటా 10 శాతం పెంచాల్సి ఉంది. ఆ క్రమంలో కౌలు మొత్తం పెరుగుతూ వచ్చింది. అయితే ఈ పదేళ్లలో రైతుల సంఖ్య బాగా తగ్గుతూ వచ్చింది. పదో ఏడాది కౌలు చెల్లించేనాటికి రైతుల సంఖ్య 29,498 నుంచి 23,384కి పడిపోయింది. ఈ అనర్హత భారిన పడిన రైతులందరూ చిన్న సన్నకారు రైతులే కావడం విశేషం. పోయిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కారణంగా తలెత్తిన ఆర్థిక ఇబ్బందులను వారు తట్టుకోలేకపోయారు. వారికిచ్చిన రిటర్నబుల్ ప్లాట్లను అమ్ముకున్నారు. దీంతో ఒప్పందం ప్రకారం వారంతా అనర్హతబారిన పడ్డారు. మొత్తం 6,114 మంది రైతులు కౌలుకు అనర్హులుకాగా వారు ఇచ్చిన భూమి 2,698 ఎకరాలు మాత్రమే. అంటే వారంతా అరెకరం లోపు నిరుపేద రైతులేనన్నమాట.

సాంకేతిక విప్లవానికి అనుగుణంగా..

పాఠ్య ప్రణాళిక రూపకల్పన

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధు మూర్తి



మాట్లాడుతున్న ఆచార్య మధు మూర్తి

పెదకాకాని, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక విప్లవం నిత్య నూతనంగా కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థుల భవితకు భరోసానిచ్చేలా పాఠ్య ప్రణాళిక రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్, ఆచార్య మధు మూర్తి పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి కొత్త పాఠ్య ప్రణాళిక కోసం.. పాఠ్య ప్రణాళిక సవరణ ప్రక్రియకు సంబంధించి ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా జరగనున్న మూడు రోజుల వర్క్ షాప్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆచార్య మధు మూర్తి ప్రారంభోపన్యాసం చేస్తూ.. నూతనంగా అమల్లోకి రానున్న పాఠ్య ప్రణాళిక చట్రంలో "11 కోర్ పేపర్లతో మేజర్, 4 ఎలక్టివ్ పేపర్లు, 6 మైనర్ ఉంటాయని పేర్కొన్నారు. మొత్తం 12 సబ్జెక్టులకు సంప్రదాయ డిగ్రీ ప్రోగ్రాంల మోడల్ సిలబస్ తయారీ కమిటీలు ఏర్పాటు చేసి, పాఠ్య ప్రణాళిక సవరణ ప్రక్రియను వర్క్ షాప్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సంపద సృష్టికర్తలుగా ఎదగాలంటే సాంకేతిక శోభతో కూడిన విద్యా విధానం అవసరమని, నూతన విద్యా విధానం (ఎన్ఈపీ -2020)కూడా అదే సూచిస్తోందని ఆయన స్పష్టం చేశారు. మేజర్ కోర్ కోర్సులు ఎలక్టివ్‌లతో సరిపోలాలని, ఆన్‌లైన్ విధానం ద్వారా మరిన్ని క్రెడిట్‌లను సంపాదించడానికి విద్యార్థులకు చాయిస్ ఇవ్వవచ్చని ఆయన అన్నారు. సిలబస్‌ని రూపొందించేటప్పుడు కమిటీలో ఉన్న సబ్జెక్ట్ నిపుణులు బ్లూమ్స్ టాక్సోనమీ, రూబ్రిక్స్ లాంటి అధునాతనమైన పద్ధతులను ఉపయోగించి సమగ్రమైన పాఠ్యాంశాలను తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి టీవీ శ్రీకృష్ణమూర్తి, కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.రోశయ్య, జి.శ్రీరంగం మాథ్యూ పాల్గొన్నారు.

ఈఏపీ సెట్ అడ్మిషన్ల ప్రారంభం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ , మెకానికల్ బ్లాక్ నందు ఈఏపీ సెట్-2025 శుక్రవారం రెండో అడ్మిషన్స్ ప్రక్రియను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధర్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం సందర్శించి అన్ని ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను, తల్లిదండ్రులతో ముఖా ముఖీ మాట్లాడారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు కల్పించిన సదుపాయాలను, ఏర్పాట్లను తెలుసుకుని సంతృప్తిని వ్యక్తపరిచారు. సాయంత్రం వరకు 70 శాతం విద్యార్థులు రిపోర్ట్ చేశారు. శనివారం ఆఖరు రోజు కావడంతో.. మిగిలిన విద్యార్థులు కూడా హాజరవుతారని ఆశాభావం వ్యక్తపరిచారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ ఆఫీసర్ డాక్టర్ ఎంఈ .తౌసిఫ్ అహ్మద్ అన్ని విభాగాల సమన్వయకర్తలు, ఆఫీసు సిబ్బంది, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా యోగా పరీక్షలు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఎమ్మెస్సీ యోగా ద్వితీయ సంవత్సరం నాలుగవ సెమిస్టర్ పరీక్షలు యూనివర్సిటీలో సజావుగా సాగుతున్నాయని యూనివర్సిటీ పీజీ ఎగ్జామ్స్ కో-ఆర్డినేటర్ ఆచార్య మన్నవ సుబ్బారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలించి, పరీక్షలు జరుగుతున్న తీరుతెన్నులను పర్యవేక్షించారు. ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎస్సీ యోగా కోర్సులో జరిగిన నాలుగవ సెమిస్టర్ పరీక్షలకు 22 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు.

దస్తావేజుకు రూ. 35 వేలు

- 20 డాక్యుమెంట్లకు రూ.7 లక్షల ముడుపులు ● మహేష్ రెడ్డి రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు ● ఇద్దరు సబ్-రిజిస్ట్రార్‌లకు ఎవరిది వారికే
- రూ. 40 కోట్ల భూమి రిజిస్ట్రేషన్‌లో బిగుస్తున్న ఉచ్చు
- పోలీసుల నుంచి వివరాలు సేకరించిన ఏసీబీ

గుంటూరు సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): రూ.40 కోట్ల భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న చింతా రెడ్డి మహేష్‌రెడ్డి రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గుంటూరులోని ఎస్ వీఎన్ కాలనీలో ఉంటూ మరణించిన కొత్తపల్లి పద్మజ భూమిని కాజేసేందుకు ఏ విధంగా ప్రణాళిక రూపొందించింది అందులో వివరించారు. నరసరావుపేటకు చెందిన డాక్యుమెంట్ రైటర్ శివ ద్వారా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో రాయబేరాలు నడిపినట్లు మహేష్‌రెడ్డి వెల్లడించారు. గుంటూరులోని ఆస్తి పత్రాలు అన్నీ నరసరావుపేటలోని డాక్యుమెంట్ రైటర్ శివ ద్వారానే ఆన్‌లైన్ నుంచి సేకరించి జీపీఏ చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. దస్తావేజుకు ఫీజు టూ ఫీజు రూపేణా రూ. 20 వేలు వరకు జాయింట్ రిజిస్ట్రార్ పఠాన్ కరీముల్లా ఖాన్‌కు చెల్లించాల్సి ఉందని తెలిపారు. అయితే ఈ దస్తావేజు నకిలీది కాబట్టి ఒక్కోదానికి మరో రూ. 20 వేలు అదనంగా ఇవ్వాలని జాయింట్ రిజిస్ట్రార్ డిమాండ్ చేసినట్లు ఒప్పుకున్నారు. ఆయనను రూ.35 వేలకు ఒప్పించినట్లు మహేష్ రెడ్డి వెల్లడించారు. మొత్తం 18 జీపీఏ దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు చెప్పారు. ఆస్తి గుంటూరులోని కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ పరిధిలోనిది కాబట్టి అక్కడి సబ్ రిజిస్ట్రార్‌ను కూడా ఒప్పించే బాధ్యత నరసరావుపేట జాయింట్ రిజిస్ట్రార్ కరీముల్లా ఖాన్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. మొత్తం 18 జీపీఏలు, రెండు రిజిస్ట్రేషన్‌ల కోసం సుమారు రూ. 7 లక్షలు ముట్టజెప్పినట్లు సమాచారం.

అప్పటి జిల్లా రిజిస్ట్రార్ పై అనుమానాలు

ఈ మొత్తం వ్యవహారంలో అప్పటి జిల్లా రిజిస్ట్రార్‌పై కూడా బాధితులు పలు ఆరోపణలు చేస్తున్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇటువంటి అడ్డగోలు వ్యవహారం జరగదని అంటున్నారు. ప్రస్తుతం మాచర్ల లో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్న అప్పటి నరసరావుపేట సీనియర్ అసిస్టెంట్‌కు కూడా ఈ కేసు లో భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోంది. అతని ఆధ్వర్యంలో నే 18 జీపీఏ లు రిజిస్ట్రేషన్ చేసి పెండింగ్‌లో పెట్టారని, వాటిని తరవాత రోజు విధులకు వచ్చిన కరీముల్లా ఖాన్ రెగ్యులర్ చేసినట్లు తెలుస్తోంది.

రంగంలోకి దిగిన ఏసీబీ

ఈ కేసు వివరాలను నల్లపాడు పోలీసుల నుంచి ఏసీబీ అధికారులు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏసీబీ అధికారులు కూడా కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నరసరావుపేట సిబ్బంది పాత్రపై విచారణ

కొత్తపల్లి పద్మజకు చెందిన 1.80 ఎకరాల భూమిని నకిలీ రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారం లో నరసరావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బందిపై శాఖా పరమైన విచారణ కు ప్రారంభించినట్లు జిల్లా రిజిస్ట్రార్ రామ్ కుమార్ వెల్లడించారు. విచారణ అనంతరం అప్పటి జాయింట్ రిజిస్ట్రార్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.


ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
శ్రీ మీసాల మురళి యాదవ్ గారు
వినుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్
శ్రీ కాత్తి పరబ్రహ్మ రెడ్డి గారు
గురప్పనాయుడుపాలెం సొసైటీ డైరెక్టర్
శ్రీ రాయల్ శ్రీకాంత్ గారు
గురప్పనాయుడుపాలెం సొసైటీ డైరెక్టర్
ప్రియతమ నాయకులు, రైతు శ్రేయోభిలాషి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్,
వినుకొండ శాసనసభ్యులు, గౌ. శ్రీ జి.వి. ఆంజనేయులు గారి ఆశీస్సులతో...
జెడ్-199 గురప్పనాయుడుపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘము లి
(పిఎసియస్) అధ్యక్షులుగా శ్రీ ముండ్రు సుబ్బారావు గారు
మరియు సొసైటీ డైరెక్టర్స్ నేడు పదవీ ప్రమాణ స్వీకారం చేయుచున్న శుభసందర్భంగా వారికి
హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ.... ఈ కార్యక్రమానికి విచ్చేయుచున్న
అతిరథ మహారథులందరికీ స్వాగతం - సుస్వాగతం తెలియజేస్తూ...
ప్రమాణ స్వీకారం తేది & సమయం & వేదిక :
ది. 26-07-2025 శనివారం ఉదయం 11 గంటలకు
గురప్పనాయుడుపాలెం సొసైటీ భవన ఆవరణ నందు అయినవోలు, నూజెండ్ల (మం)
శ్రీ ముండ్రు సుబ్బారావు గారు
గురప్పనాయుడుపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘము లి (పిఎసియస్) అధ్యక్షులు
పెద్దిరెడ్డి వెంకట రామిరెడ్డి
సిఇఓ, గురప్పనాయుడుపాలెం పిఎసియస్
జడ్డా సుబ్బులు, రామయ్య
నూజెండ్ల మండల జెడ్పీటీసీ
గంగినేని బాబు
నూజెండ్ల మండల టీడిపి అధ్యక్షులు
రావుల బుజ్జి
అయినవోలు డిసి చైర్మన్
రేవెళ్ల బుల్లెయ్య నాయుడు
శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయ ట్రస్ట్ అధ్యక్షులు
శ్రీ కోదండరామాలయం ధర్మకర్త, అయినవోలు
జడ్డా వెంకట్రావు
శ్రీ నిధి ప్రాజెక్ట్స్ ఎండి, హైదరాబాద్
డా॥ అన్నవరపు వీరాంజనేయులు, M.D.,
శ్రీనివాస నర్సింగ్ హోం, వినుకొండ
కంచుమాటి నరేష్
స్టేట్ విటిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ, మారెళ్ళవారిపాలెం
నక్కా బుల్లేశ్వరరెడ్డి
ములకలూరు డిసి చైర్మన్
వడ్లమూడి గాలెయ్య
టిడిపి యూనిట్ ఇంఛార్జ్, మూర్తిజాపురం
నరసాయినిపాలెం పోలేరమ్మ గుడి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్
గోగులపాటి వెంకటేశ్వర్లు
క్లాస్-1 కాంట్రాక్టర్, కొత్త జడ్డావారిపాలెం
రావుల నాగమల్లేశ్వరరావు
పల్నాడు జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి
నర్రా శ్రీనివాసరావు
నీటి సంఘము అధ్యక్షులు, తిమ్మాపురం
కుంటా కోటిరెడ్డి
మదమంచిపాడు దేవాలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్
కార్రపాటి ప్రసాద్
పల్నాడు జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు
ముండ్రు సూర్యనారాయణ
టిడిపి సీనియర్ నాయకులు, మూర్తిజాపురం
దగ్గుబాటి లింగయ్య
డీలర్, టిడిపి యూనిట్ ఇంఛార్జ్, చెరువుకొమ్ముపాలెం
పోకూరి శ్రీనివాసరావు
టిడిపి నాయకులు, చెరువుకొమ్ముపాలెం
ఫణిదపు వెంకటేశ్వర్లు
మాజీ ఎంపిపి, నూజెండ్ల
ముత్తినేని మల్లిఖార్జున
టిడిపి యువ నాయకులు, భూమాయిపాలెం
ముత్తినేని వెంకట నారాయణ
టిడిపి యువ నాయకులు, భూమాయిపాలెం
తేలప్రోలు రామారావు
టిడిపి సీనియర్ నాయకులు, భూమాయిపాలెం
కర్నాటి శ్రీనివాసరావు
వినుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్
తోట ఆంజనేయులు
సర్పంచ్, అయినవోలు
ఫణిదపు గాలేశ్వరరావు
అయినవోలు వైస్ డీసీ చైర్మన్
దరిశాల ఆంజనేయులు NRI
టిడిపి నాయకులు, మూర్తిజాపురం
దేవినేని చిన్న వెంకయ్య
మాజీ డిసి చైర్మన్, మూర్తిజాపురం
బత్తిన కొండలు
సర్పంచ్, చింతలచెరువు
ముండ్రు బాల వెంకటేశ్వర్లు
టిడిపి నాయకులు, మూర్తిజాపురం
ముండ్రు వెంకట నారాయణ NRI
మూర్తిజాపురం
కాళ్ళారి హనుమంతరావు
టిడిపి యూత్ నాయకులు, అయినవోలు
చిమ్మని శ్రీను
టిడిపి నాయకులు, వేములబండ
చాపలమడుగు చిన్న సైదులు
నూజెండ్ల మండల టీడిపి యూత్ నాయకులు, చింతలచెరువు
దరిశాల శ్రీనివాసరావు
టిడిపి నాయకులు, మూర్తిజాపురం
దేవినేని వెంకట మూర్తెయ్య
టిడిపి నాయకులు, మూర్తిజాపురం
శీలం కొండలు
సర్పంచ్, మూర్తిజాపురం
జడ్డా లక్ష్మీనారాయణ
టిడిపి కో- యూనిట్ ఇంఛార్జి, చెరువుకొమ్ముపాలెం
తుమాటి పెద్ద అచ్చెయ్య
టిడిపి బూత్ కన్వీనర్, తంగిరాల
జడ్డా వెంకటేశ్వర్లు
టిడిపి నాయకులు, అయినవోలు
ముతడక వీరాచారి
నూజెండ్ల మండల ఆర్ఎంపి డాక్టర్స్ అధ్యక్షులు
నూజెండ్ల మండల విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు, తలార్లపల్లి

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పీఎన్‌డీటీపై జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం

నరసరావుపేట లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి అధ్యక్షతన పీఎన్‌డీటీపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఎస్ డాక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, వెల్లడించినా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.ప్రసూన, పల్నాడు, ఏరియా హాస్పిటల్ హెచ్‌వోడీ డాక్టర్ కె.విజయలక్ష్మి, సత్తెనపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హెచ్‌వోడీ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బి.లక్ష్మణరావు, డాక్టర్ ఎస్.గిరిరాజు ఫిజీషియన్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కరీం, ఆశ వర్కర్స్ యూనియన్ లీడర్ దేవభక్తుల శివకుమారి, పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం ఆఫీసర్ సాంబశివరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాదనాయక్ పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక పీజీఆర్ఎస్

నరసరావుపేట టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఉదయం 10గంటలకు ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం తెలిపారు. జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలు ప్రత్యేక పరిష్కార వేదికను వినియోగించుకోవాలన్నారు.

బార్బర్ షాపులకు ఉచిత విద్యుత్ జీవోని విడుదల చేయాలి

నాయీ బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన బార్బర్ షాపులకు 200యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ జీవోని వెంటనే విడుదలచేసి అమలుచేయాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ కోరారు. శుక్రవారం బీసీ సంక్షేమ శాఖమంత్రి సవితను తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అమరావతిలో నాయీ బ్రాహ్మణులకు ఐదు ఎకరాల స్థలం కేటాయించి నాయీబ్రాహ్మణ సంగీత (డోలు, నాదస్వరం) పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

ఘనంగా పింక్ కలర్ డే

చిలకలూరిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీవీ ఐఐటీ స్కూలులో పింక్ కలర్ డే సెలబ్రేషన్స్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు పాల్గొని వారి వారి ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. చిన్నారులు వివిధ రకాల పింక్ రంగు దుస్తులు ధరించి, సీతాకోక చిలుకల వేషధారణలతో సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పారేపల్లి ఉదయ్ కుమార్ ప్రిన్సిపాల్ దేవులపల్లి ఫణి కుమార్, ఉపాధ్యాయిలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో మండల ప్రత్యేకాధికారి తనిఖీ

బొల్లాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బొల్లాపల్లిలోని రెండు ప్రభుత్వ హాస్టళ్లను మండల ప్రత్యేకాధికారి అంకారావు శుక్రవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. బొల్లాపల్లిలో ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గురుకుల పాఠశాలను సందర్శించి హాస్టళ్లలోని వసతులు, భోజనం తదితర అంశాలను పరిశీలించారు. హాస్టళ్లలో తాగు నీటి సమస్యగా ఉందని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకురాగా ఎంపీడీవోతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎంఈవో పార్వతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో అనర్థాలు: సీఐ

ఈపూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నకిలీ, కల్తీ మద్యం సేవించడం వలన ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ డీ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాలలోనే మద్యం కొనుగోలు చేసి తాగాలన్నారు. బయట లూజుగా దొరికే చోట మద్యం తీసుకోరాదన్నారు. ఎంఆర్‌పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తే చర్యలు ఉంటాయన్నారు. శుక్రవారం స్టేషన్ పరిధిలోని మద్యం షాపులను తనిఖీ చేశారు.

న్యాయవాద సంఘానికి కూలర్ బహూకరణ

నరసరావుపేట లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యాయవాద సంఘ కార్యాలయానికి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది బోయిన పిచ్చేశ్వరరావు, బీవీఆర్‌కే స్వామి, మేజర్ బీఎస్ఆర్‌కే రాజులు వారి తండ్రి బోయిన సుబ్బారావు జ్ఞాపకార్థం రిఫ్రిజిరేటర్‌ను బహూకరించారు. శుక్రవారం న్యాయవాద సంఘ కార్యాలయంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు జీవీ సుబ్బారావుకు వీరు రిఫ్రిజిరేటర్‌ను అందించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఈపూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా కొచ్చెర్ల అంకాళ పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకొని కుంకుమపూజ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

● రొంపిచర్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, వడ్లమూడి వారి పాలెం, విప్పర్ల, గోగులపాడు, సంతగుడిపాడు గ్రామాల్లో గల శివాలయాలు, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం

నరసరావుపేట టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు శుక్రవారం తెలిపారు. 34వ వార్డులో శానిటేషన్ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరసరావుపేటకు పరిశుభ్రతలో 14వ ర్యాంకు వచ్చినట్లు పేర్కొన్నారు. పల్లెల్లో కూడా పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు.

అద్దె గదుల్లో గ్రంథాలయం

● సొంత భవనానికి నోచుకోని వినుకొండ
● వసతుల లేమి, కొరవడుతున్న పర్యవేక్షణ
● వైభవం కోల్పోతున్న విజ్ఞాన బాంఢాగారాలు



ఆలనాపాలనా లేని గ్రంథాలయంలోని పుస్తకాలు



కీర్తిహాల్ పక్కన ఒరిగిపోయిన రేకు తలుపుతో దర్శనమిస్తున్న గ్రంథాలయం దారి

వినుకొండ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం అంటే విజ్ఞానాన్ని అందించే బాంఢాగారాలు. సరైన పర్యవేక్షణ లేక గ్రంథాలయాలు కునారిల్లుతున్నాయి. అంతేకాకుండా ప్రజల నుంచి ఆదరణ లేక నేటి కంప్యూటర్ కాలంలో వాటి మనుగడ కోల్పోతున్నాయి. వినుకొండ పట్టణానికి చెందిన గ్రంథాలయం రోజురోజుకు ప్రజల మన్ననలు కోల్పోతోంది. కీర్తిహాల్ సెంటర్‌లోని అండర్ గ్రౌండ్‌లో నెలకు రూ.10వేలు అద్దె గదిలో నేటికి అది కొనసాగుతోంది. వర్షంవస్తే చాలు పాఠకులు ఆ అండర్ గ్రౌండ్‌లోని గ్రంథాలయంలో కాలు మోపలేని పరిస్థితి. విలువైన విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు, పేపర్లు, నవళ్లు, మత గ్రంథాలు, బాలలసాహిత్యం, విజ్ఞాన శాస్త్రాలు, జీవిత చరిత్రలు, భాషా శాస్త్రాలు వంటివి తడిచి పుస్తకాలు వాటి రూపురేఖలు కోల్పోతున్నాయి. గత కొన్నేళ్లుగా ప్రజల మనుగడ లేకపోవడంతో పుస్తకాలను కదిలించే నాథుడు లేక పట్టుకుంటే పేపరు చినిగిపోయే స్థితిలో అవి దర్శనమిస్తున్నాయి. సుమారు లక్షకు పైన జనాభా ఉన్న వినుకొండ ప్రాంతంలో గ్రంథాలయం పరిస్థితిని చూసిన విద్యావంతులు, విశ్రాంతి ఉద్యోగులు, గృహిణులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పది సంవత్సరాలుగా నూతన భవనం కోసం జిల్లా, స్థానిక గ్రంథాలయ అధికారులు కనీసం ఐదు సెంట్ల జాగా చూపితే ప్రభుత్వ నుంచి నిధులు తెచ్చి భవనం నిర్మిస్తామని అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా పాలకులు, అధికారులు ఈ గ్రంథాలయంపై పట్టించుకోలేదు. పుస్తకాలు కొనలేని నిరుపేదలకు ఆసరాగా నిలిచిన ఈ గ్రంథాలయాలు వినియోగంలోకి రాకపోవడంపై ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారు. నిశ్శబ్దానికి మారుపేరుగా నిలిచే ఈ ప్రాంతంలో జ్ఞానం, ఏకాగ్రత పెంచుకోవాల్సిన ఈ ప్రదేశం వెలవెలబోతుంది. ఇప్పటికైనా అధికారులు విద్యార్థులకు ఎంతో సమాచారాన్ని అందించే గ్రంథాలయంతో పాటు విలువైన సమాచారాన్ని పుస్తకాల మనుగడను కాపాడాలని నిరుద్యోగ యువత వాపోతున్నారు.

దాతలు పుస్తక వితరణ

వినుకొండ ఎంపీడీవో పుట్టారెడ్డి 2012 వీఆర్వో, 2018 డీటీ, 2022 ఎంపీడీవోతో పాటు ఇటీవల గ్రూప్ 1 పరీక్షలకు సిద్ధమయ్యేందుకు కొనుగోలు చేసిన వందల విలువైన పుస్తకాలను ఈ గ్రంథాలయానికే వితరణ గా అందజేశారు. ఇలా ఎందరో విద్యావంతులు ఉద్యోగాలు సంపాదించి విలువైన పుస్తకాలను విక్రయించలేక తాము పొందిన విజ్ఞానానికి పలువురికి అందించేందుకు పుస్తక వితరణ చేసేందుకు సిద్ధమైనా వినుకొండ గ్రంథాలయంలో ఖాళీ జాగా లేకపోవడంతో నిరుద్యోగులు ఉసూరుమంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టిసారించి, లక్షల మంది ఉన్న పట్టణ జనాభాకు మంచి గ్రంథాలయాన్ని నిర్మించి ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

దుర్మార్గ పాలన చేసిన వైసీపీ

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రజలపై దుర్మార్గపాలన కొనసాగించిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణం 2, 3, 5 వార్డులలో పీ-4 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వైసీపీ హయాంలో ప్రతిపక్ష సభ్యులపై మద్యం, గంజాయి, ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయించి ప్రజలు తమ ఇళ్లలో ప్రశాంతంగా జీవించలేని పరిస్థితిని సృష్టించిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అందరూ హాయిగా ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ రూ 3 వేల నుంచి రూ 4 వేలకు పెంచిందని, వికలాంగుల పెన్షన్ రూ 3 వేల నుంచి రూ 6 వేలకు పెంచారన్నారు. పూర్తిగా మంచానికే పరిమితం అయిన వారికి, కిడ్నీ బాధితులకు రూ.15వేలు ఇస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం పారదర్శకత, సమర్ధతతో పాలన సాగిస్తుంద న్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గుడూరు శేఖర్, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్లటూరు ఆర్అండ్‌బీ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

● హైకోర్టు ఉత్తర్వులు అమలు చేసిన అధికారులు





పొక్లెయిన్‌తో ఇళ్లను తొలగిస్తున్న అధికారులు, నేలమట్టమైన రేకుల దుకాణాలు

బొల్లాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వుల మేరకు మండలంలోని వెల్లటూరు ఆర్అండ్‌బీ రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు అధికార యంత్రాంగం శుక్రవారం చేపట్టింది. ఒక డీఎస్పీ, ముగ్గురు సీఐలు, 11మంది ఎస్ఐలు, 25మంది ఆర్అండ్‌బీ అధికారులు, 30మంది రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకొని హైకోర్టు ఉత్తర్వులను అమలు పరిచారు. గ్రామానికి చెందిన ద్రోణాదుల మల్లికార్జునాచారి తన పొలానికి వెళ్ళేందుకు రోడు లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఆర్అండ్‌బీ రోడ్డుపై ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. దాంతో పోలీసులు గ్రామంలో బారికేడ్లను ఏర్పాటుచేసి జనాన్ని రానీయకుండా ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమించి నిర్మించుకొన్న మూడు ఇళ్ళు, నాలుగు షాపులలోని సామగ్రిని బయటకు తీసి రెండు పొక్లెయిన్‌ల సాయంతో నిర్మాణాలు తొలగించారు. ఆక్రమణలన తొలగించే క్రమంలో 3 ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 4 రేకుల షెడ్లను అధికారులు నేలమట్టం చేశారు. నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, రూరల్ సీఐ ప్రభాకర్‌రావు, ఎస్ఐ బాలకృష్ణ, తహసీల్దార్ సుధాకర్, ఆర్అండ్‌బీ ఏఈ నవ్య, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన కమిటీ అధ్యక్షుడితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

గుంటి ఆంజనేయస్వామి దేవస్థాన నూతన కమిటీ ప్రమాణస్వీకారం

వినుకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఎంపికైన అధ్యక్షులు చిలంకూరి వెంకటకోటేశ్వరరావుతో పాటు నూతన కమిటీ సభ్యులు భాగవతుల రవికుమార్, ఖజ్జాయం విజయలక్ష్మి, కొంజేటి లక్ష్మీనారాయణ, ముక్కాని రామయ్య, పాలడుగు శ్రీను, దూళ్ల సుజాత, లక్ష్మీ నాగరాజు, లక్ష్మీబాయి, నారాయణ ఆనందాచార్యులుతో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటి ఆంజనేయస్వామి దేవస్థానాన్ని బాగా అభివృద్ధి చేసి దేవాలయానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కౌన్సిలర్ షేక్ షకీలా బేగం, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రోశయ్య, జనసేన నాయకుడు కొంజేటి నాగశ్రీను, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ రామ్మోహనాచార్యులు, ఈవో పెద్దిరెడ్డి సుధాకరరెడ్డి, గట్టుపల్లి శ్రీనివాసరావు, గంధం కోటేశ్వరరావు, పి.వి.సురేష్, గోవిందరాజులుతో పాటు గుంటి ఆంజనేయస్వామి భక్తబృందం, వాసవి క్లబ్, వనితా క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సభ్యులు, విశ్వహిందూ పరిషత్ పెద్దలు, రామలింగేశ్వరస్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

టీడీపీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

రొంపిచర్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన చెరుకూరు సురేష్ కొద్ది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో ఐర్లాండ్లో మృతిచెందాడు. ఇతను తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుని ఉన్నాడు. కాగా పార్టీ తరపున ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం అందజేశారు. ఐదు లక్షల రూపాయలు చెక్కును తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గంజాయితో రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ఈపూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తు పదార్థాలతో జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశాడని, యువత తప్పుదారిపడుతుంటే ఆనందించాడని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి ప్రచారంలో బాగంగా శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. అనంతరం కూటమి ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారప్రతినిధి రాపర్ల జగ్గారావు, మాజీ ఎంపీపీ బొల్లా వెంకటకోటయ్య, నర్రా కిశోర్, ఎన్.రామకోటేశ్వరరావు, పీ సైదారావు, మునుగోటి మల్లయ్య, నర్రా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న బాలయ్యను అభినందిస్తున్న చీఫ్‌విప్ జీవీ, డీసీసీబీ చైర్మన్ మక్కెన

అన్నదాతల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ఈపూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల ఆర్థిక అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం జరిగిన అంగలూరు సొసైటీ చైర్మన్, సభ్యులు ప్రమాణ స్వీకారానికి జీవీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ తిరుమల శెట్టి బాలయ్య, డైరెక్టర్లు పాశం యలమంద, ఎస్.ఆంజనేయులును అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో జీవీ మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తక్కువ వడ్డీకే పంట రుణాలను, రాయితీపై విత్తనాలను, వ్యవసాయ పరికరాలను అందిస్తోందన్నారు. పంట మార్పిడి పద్ధతితో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ప్రభుత్వం పండ్ల మొక్కల పెంపకం కోసం నూరుశాతం రాయితీ ఇస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వలేకపోయిందని, కొనుగోలు చేసిన పంటలకు ఏడాది గడిచిన నగదు చెల్లించలేదన్నారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు తక్కువ వడ్డీకి పంట రుణాలు ఇవ్వడమే కాకుండా ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, ఈపూరు సొసైటీ అధ్యక్షుడు విడపలపాటి హనుమయ్య, మాజీ ఎంపీపీలు బొల్లా వెంకటకోటయ్య, బైలడుగు రామయ్య, డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాలరావు, సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు, జనసేన నాయకులు నాగశ్రీను, సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరి శాంతారావు, సర్పంచ్‌లు గోనుగుంట్ల శ్రీనివాసరావు, బి.సుబ్బయ్య, న్యాయవాదులు రామకోటేశ్వరరావు, సైదారావు, టీడీపీ నాయకులు ఎస్.కిశోర్, సి.శ్రీనివాసరెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి, వి.సత్యన్నారాయణ, ఎ.శ్రీనివాసరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

వినుకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పలు గ్రామాల నుంచి వృద్ధులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ఆంజనేయులుకు వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రాలను పరిశీలించి సంబంధిత అధికారులను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఏళ్ల తరబడి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులు, మహిళల సమస్యలను అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకుడు నాగశ్రీను, కౌన్సిలర్ షకీలాబేగం, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రోశయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్‌కు స్థలం కేటాయిస్తాం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీఎల్ఎస్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతో పాటు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని మాట్లాడుతూ యూనియన్ భవనం కోసం స్థలం అడిగారని, త్వరలో వారి కోరిక నెరవేరుస్తానని, భవనం నిర్మాణానికి వ్యక్తిగతంగా తన వంతుగా రూ.లక్ష విరాళం ఇస్తామని ప్రకటించారు. పీఎంఈజీపీ వంటి స్కీమ్‌లో 30శాతం వరకు సబ్సిడీ రుణాలు లభిస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫొటోగ్రాఫర్లు బీమా చేయించుకోవాలని, వీరి కోసం శివశక్తి లీలా ఫౌండేషన్ తరపున గతంలో రూ.5లక్షలు ప్రమాదబీమా చేయించామన్నారు. శిక్షణ కార్యక్రమంలో సోని కంపెనీ ట్రైనర్ ఫారుక్, సాయి రెడ్డిలు ఫొటోగ్రాఫర్లకు పలు మెళకువలు నేర్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు కేశనపల్లి సుబ్బారావు, సెక్రటరీ రాయల్ శ్రీకాంత్, గోవాడ శ్రీనివాసరావు, గుంటకల అంజి, శ్యాంకుమార్, వెంకట్రావు, నాగేశ్వరరావు, విజయ్, బ్రహ్మం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

43 మందికి రూ.24 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని 43మందికి రూ.24.13 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం తన నివాస గృహంలో పంపిణీ చేశారు. అనారోగ్య సమస్యలు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతూ అత్యవసర వైద్య చికిత్సలు అవసరమైన లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలలో ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం కొత్త వెలుగులు నింపుతోందని ఈ సందర్భంగా ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, టీడీపీ నాయకులు జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయిబాబు, పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి పాల్గొన్నారు.

యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటికి సత్కారం

చిలకలూరిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన పిల్లి కోటిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, టీడీపీలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు శుక్రవారం సత్కరించారు. తనను యార్డు వైస్ చైర్మన్‌గా నియమించినందుకు ఎమ్మెల్యే పుల్లారావుకు పిల్లి కోటి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్తిపాటిని కలిసిన గడిపూడి

శావల్యాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం సొసైటీ చైర్మన్‌గా గడిపూడి విశ్వనాథం ఈ నెల 28వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆహ్వానించేందుకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును చిలకలూరిపేటలోని ఆయన నివాసంలో కూటమి నాయకులతో కలసి విశ్వనాథం శుక్రవారం కలిశారు. సొసైటీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్న విశ్వనాథంను ప్రత్తిపాటి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ బీజేపీ నాయకులు యార్లగడ్డ లెనిన్‌కుమార్, జిల్లా తెలుగురైతు ఉపాధ్యక్షుడు జి.హనుమంతరావు, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు గద్దె వీర మస్తాన్‌రావు, గ్రామపార్టీ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

● రూరల్ సీఐ సుబ్బనాయుడు

యడ్లపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరిగతిన విచారించి పూర్తిచేయాలని, పెండింగ్ కేసులు లేకుండా చూడాలని రూరల్ సీఐ సుబ్బనాయుడు సూచించారు. శుక్రవారం యడ్లపాడు స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఆయన ముందుగా రికార్డులను పరిశీలించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్) వ్యవస్థలోని కేసుల అప్‌డేషన్‌ను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను ఎస్ఐ శివ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవలసిన చర్యల గురించి దిశా నిర్దేశం చేశారు. అలాగే సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని మార్గనిర్దేశం చేశారు. అనంతరం సిబ్బందికి రెయిన్‌కోట్‌లను పంపిణీ చేశారు.



సమావేశంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి రవి

కిల్కారి సేవలపై డీఎంహెచ్‌వో సమీక్ష

నరసరావుపేట లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం ఆశ నోడల్ అధికారుల సమావేశం కిల్కారి సేవలపై శిక్షణ, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాం ను గర్భిణులు, బాలింతలు కోసం ప్రవేశపెట్టటం జరిగిందన్నారు. మాత శిశు మరణాలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ సేవను ప్రవేశ పెట్టిందన్నారు. గర్భిణులు 4వ నెల మొదలుకొని బిడ్డ ఏడాది వచ్చే వరకు కిల్కారి ఫోన్లు వస్తాయన్నారు. కిల్కారి కాల్ నెంబర్ 01244451660ను గర్భిణులు మొబైల్‌లో సేవ్ చేసుకుని వారు వచ్చే సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, సురేఖ, సురేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.